ఆదివారం
11-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 51
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యూట్యూబ్ మాజీ సీఈవో మృతి

వాషింగ్టన్: యూట్యూబ్ మాజీ సీఈవో సుసాన్ వోజ్కికీ కన్నుమూశారు.

ఆమె భర్త డెన్నిస్ ట్రోపర్ ఫేస్‌బుక్‌లో భావోద్వేగ పోస్ట్ చేసి ఈ విచారకరమైన వార్తను షేర్ చేశారు. '56 సంవత్సరాల నా ప్రియమైన భార్య, ఐదుగురు పిల్లలకు తల్లి రెండేళ్లుగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో పోరాడి ఈ రోజు మమ్మల్ని విడిచిపెట్టారు' అని వోజ్కికీ భర్త ఫేస్‌బుక్‌లో రాసుకొచ్చారు. ఆమె కేవలం సీఈఓ మాత్రమే కాదు, ఒక స్ఫూర్తిదాయకమైన నాయకురాలు, ప్రేమగల భార్య, దయగల తల్లి అని పేర్కొన్నారు. ఆమె 2014 నుంచి 2023 వరకు యూట్యూబ్‌లో పనిచేశారు. కంపెనీని కొత్త శిఖరాలకు తీసుకువెళ్లారు.

స్టీల్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు కుట్ర

కేంద్రాన్ని దుయ్యబట్టిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : ఉక్కు కర్మాగారాలను ప్రైవేటీ కరించే ప్రయత్నాలపై కాంగ్రెస్ శనివారం ప్రభుత్వంపై విమర్శలు కురిపించింది. ఇది దేశంలోని పారిశ్రామిక పునాదిని 'ఉక్కిరిబిక్కిరి' చేయడమేనని, ఇందులో కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డి కుమారస్వామి పాత్ర ఉందని ఆరోపించింది. కుమారస్వామి రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్

- మిగతా 2 లో

నిజాయతీకి ప్రతీక కేజ్రీవాల్

నియంతృత్వం ఎంతోకాలం సాగదు: సిసోడియా

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ త్వరలో జైలు నుంచి విడులవుతారని ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఆశాభావం వ్యక్తం చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌ను నిజాయతీకి ప్రతీకగా ఆయన అభివర్ణించారు. అలాంటి కేజ్రీవాల్‌ను దెబ్బ తీసేందుకు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు

- మిగతా 2 లో



బంగ్లాదేశ్ సీజే హసన్ రాజీనామా

ఢాకా: బంగ్లాదేశ్‌ను విద్యార్థి ఉద్యమం కుదిపివేసింది. షేక్ హసీనాను గద్దె దించడమే కాకుండా ఆమె అనుయాయులను కూడా పదవుల్లో నుంచి తప్పిస్తోంది. గతేడాది సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఒబైదుల్ హసన్ రాజీనామాకు విద్యార్థులు శనివారం డిమాండ్ చేశారు. షేక్ హసీనాకు నమ్మకస్తుడిగా ఉన్న ఈ న్యాయమూర్తి తన పదవికి రాజీనామా చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆవరణలో ఆందోళనలకు దిగారు. సీజే హసన్‌కు అల్టిమేటాన్ని జారీచేశారు.

పూర్వ వైభవానికి కృషి

ప్రజాక్షేత్రంలో పోరాటాల ద్వారానే సాధ్యం

టీటీడీపీ ముఖ్యనేతలకు చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలంగాణ రాష్ట్రంలోనూ త్వరలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా నాయకత్వం కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఎన్ని ఇబ్బందులున్నా ప్రజాక్షేత్రంలో నిత్యం పోరాటాల ద్వారానే అది సాధ్యపడు తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. పొలిట్‌బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు,

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ ఎన్నికపై ఉత్కంఠ

- ఎల్లుండి నామినేషన్‌కు తుది గడువు
- అభ్యర్థి ఎంపికపై కూటమి ఊగిసలాట
- వైసీపీ అభ్యర్థి బొత్స రేపే నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఈనెల 30న జరగనున్న ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికపై రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. దాదాపు 75 శాతం ఓటర్ల బలంతో గెలుపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీమాతో ఉండగా, కూటమిలో పోటీపై ఊగిసలాట ధోరణి కనపడుతోంది. ఈనెల 13వ తేదీ నామినేషన్ల దాఖలుకు తుది గడువు కాగా, ఇంతవరకు కూటమి అభ్యర్థిని కూడా ఎంపిక చేయలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఈనెల 12న ఆయన నామినేషన్ దాఖలు చేయడానికి కూడా రంగం సిద్ధం చేసుకుంటు న్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాత్రం ఇంకా అభ్యర్థి ఎంపికపైనే కసరత్తు నిర్వహిస్తోంది. సీఎం చంద్రబాబు శుక్రవారం ప్రత్యేకంగా దీనిపై ఉత్తరాంధ్ర నేతలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నిక పైన సుదీర్ఘ సమీక్ష చేశారు. పోటీకి దిగే అంశం పైన కూటమి నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినట్లు తెలిసింది. స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధుల బలం వైసీపీకి ఉన్నప్పటికీ, వారిలో ఎక్కువ శాతం కూటమి వైపు ఆకర్షితులవుతున్నారని, పోటీ చేస్తే విశాఖ స్టాండింగ్ కమిటీ ఎన్నిక తరహాలో విజయం ఖాయమని కొందరు నేతలు చంద్రబాబుకి తెలిపారు. మరికొందరు మాత్రం ఇప్పటికే వైసీపీకి చెందిన ఓటర్లను అండర్ గ్రౌండ్‌కు తరలించి క్యాంపు

- మిగతా 2 లో

భారత్‌లో త్వరలో సంచలనం

హిండెన్‌బర్గ్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీలపై గతేడాది అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదిక దేశ వ్యాపార రంగాన్ని కుదిపేసింది. దానిపై ఇప్పటికీ వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ పరిణామాల వేళ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తాజాగా మరో పోస్ట్ చేసింది. శనివారం ఉదయం తన 'ఎక్స్' ఖాతాలో 'సమ్‌థింగ్ బిగ్ సూన్ ఇండియా' అని రాసుకొచ్చింది. అంటే 'భారత్‌లో త్వరలో మరో సంచలనం వెలుగు చూస్తుంది' అని పేర్కొంది. హిండెన్‌బర్గ్ భారత మార్కెట్లలో మరో బాంబు పేల్చనుందా అని నెట్టింట్లో ఆందోళన మొదలైంది.

ఈసారి ఏ కంపెనీపై నివేదిక విడుదల చేయనుందో అనే చర్చ జరుగుతోంది. గత కొన్ని రోజులుగా భారత స్టాక్ మార్కెట్లు కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయి. ఇలాంటి సమయంలో హిండెన్‌బర్గ్ ఇచ్చే నివేదిక ట్రేడింగ్‌పై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే హిండెన్‌బర్గ్ ఇలా కుట్రపూరిత ఆరోపణలు చేస్తోందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

విధ్వంసాలు కాదు... హామీలపై దృష్టిపెట్టండి

సీఎం చంద్రబాబుకు జగన్ సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఇకనైనా రాష్ట్రంలో హత్యలు, విధ్వంసాలు ఆపి సూపర్ సిక్స్ సహా ఇచ్చిన హామీలను తు.చ. తప్పక అమలు చేయాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ఈ రాష్ట్రం బాధ్యత నాది అన్నారు. పైపెచ్చు రాష్ట్రానికి రూ.14 లక్షల కోట్ల అప్పులున్నాయని, అయినా సంపద సృష్టిస్తానని, హామీలకు గ్యారెంటీ నాదే అని అనేక సార్లు చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక రాష్ట్రం బాధ్యత ప్రజలదంటూ నైజాన్ని బయటపెట్టారు. ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది పచ్చిమోసం కాదా? అని ప్రశ్నించారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి క్షణం నుంచే మీరు ప్లేటు ఫిరాయించారు. ఖజానా ఖాళీ అయిపోయిందంటూ తప్పుడు శ్వేతపత్రాలు జారీచేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. అప్పులు ఉన్నట్లుగా వాటికి లేని వడ్డీలు కడుతున్నట్టుగా అనేక సార్లు మాట్లాడి ప్రజలను మాయచేసే ప్రయత్నం చేస్తున్నారు. తల్లికి వందనం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇవ్వలేదు, రైతు భరోసా కింద ప్రతి రైతుకు రావాల్సిన రూ.20 వేలు రాలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రెండు త్రైమాసికాల డబ్బులు పెండింగ్, వసతి

- మిగతా 2 లో

ఇది అసాధారణ విపత్తు

అన్ని విధాలా సహకరిస్తాం: ప్రధాని హామీ

వయనాడ్‌లో మోదీ పర్యటన- కొండచరియలు విరిగిన ప్రాంతాల ఏరియల్ సర్వే

బాధితులకు పరామర్శ- పరిస్థితులపై అధికారులతో సమీక్ష

వయనాడ్: ప్రకృతి విలయానికి అతలాకుతలమైన కేరళలోని వయనాడ్‌లో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పర్యటించారు. కొండచరియలు విరిగిపడిన చురాల్మాల సహా శిథిలమైన ప్రాంతాలను, శిబిరాలను సందర్శించారు. తమ వారిని కోల్పోయిన ఇద్దరు పిల్లలతో పాటు బాధితులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. తొలుత ఏరియల్ సర్వే నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ 'ఇది అసాధారణ విపత్తు' అని అన్నారు. శిథిలమైన ప్రాంతాల పునర్నిర్మాణానికి అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. 'వయనాడ్ ఘటన గురించి తెలిసినప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నా. ఈ విపత్తుకర పరిస్థితుల్లో సహాయ సహకారాలు అందించగలిగిన కేంద్ర ప్రభుత్వంలోని అన్ని సంస్థలను క్రియాశీలం చేశాం. ఇది సాధారణ విపత్తు కాదు. వేలాది కుటుంబాల కలలు చెదిరిపోయాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను చూశా... పునరావాస కేంద్రాలకు వెళ్లి బాధితులను పరామర్శించాను. విపత్తుకర పరిస్థితులను ఎదుర్కొన్న వారి అనుభవాలను తెలుసుకున్నా. ఆసుపత్రికి వెళ్లి గాయపడిన వారిని కలిశా' అని మోదీ తెలిపారు.

మోదీ ఉదయం 11 గంటలకు కన్నూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆయనకు స్వాగతం పలికారు. భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లో వయనాడ్‌కు బయల్దేరారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా దెబ్బతిన్న ముండక్కై, చురాల్మాల తదితర ప్రాంతాల్లో ప్రధాని ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆయన వెంట గవర్నర్, సీఎంతో పాటు కేంద్రమంత్రి సురేశ్ గోపి ఉన్నారు. మోదీ మధ్యాహ్నం 2.30 గంటలకు మెప్పాడిలోని శిబిరానికి చేరుకొన్నారు. దాదాపు అర గంట సేపు అక్కడే గడిపారు. బాధితులను కలిసి వారి బాధలు, అవసరాలను తెలుసుకొన్నారు. కన్నీళ్లు పెట్టుకున్న వారిని ఓదార్చారు. చురాల్మాలలో సహాయక సిబ్బంది, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వేణు, జిల్లా అధికారులతో మాట్లాడారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, సహాయక చర్యల వివరాలు తెలుసుకున్నారు. రాళ్లురప్పలతో నిండివున్న ఆ ప్రాంతంలో కలియతిరిగారు. బెయిలీ

- మిగతా 2 లో

రామచంద్రరావు మృతి

సీపీఐ నేతలు, ప్రముఖుల ఘన నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర కార్యాలయం మాజీ కార్యదర్శి, కోశాధికారి ధూళిపాళ్ల సీతారామచంద్రరావు (డీఎస్ రామచంద్రరావు-89) శనివారం తెల్లవారు జామున 4 గంటలకు హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో మరణించారు. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో 1935లో ఆయన జన్మించారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు నారాయణ లండన్‌లో స్థిరపడగా, రెండవ కుమారుడు చింతామణి హైదరాబాద్‌లో, మూడో కుమారుడు రవి ఢిల్లీలో ఉన్నారు. డీఎస్ రామచంద్రరావు 1964లో సీపీఐ ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. 2023 వరకు దాదాపు 60 ఏళ్ల పాటు సమర్థవంతంగా ఆ బాధ్యతలు నిర్వహించారు. సీపీఐ అగ్ర నేతలు నీలం రాజశేఖర్‌రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, తమ్మారెడ్డి సత్య నారాయణ, నల్లమల గిరిప్రసాద్, దాసరి నాగభూషణరావు, సురవరం

- మిగతా 2 లో

హాంఫట్!

ఆక్రమణలో దేవునిమాన్యం భూములు

ఫిర్యాదులు పట్టించుకోని రెవెన్యూ అధికారులు

కోట్లు విలువ స్థలం కాజేసేందుకు రాజకీయ కుట్ర

విశాలాంధ్ర-పలాస/మందస: శ్రీకాకుళం జిల్లా మందసలో దేవదాయశాఖకు చెందిన విలువైన భూములు వివాదాస్పదంగా మారుతున్నాయి. తమ శాఖకు చెందిన భూముల్లో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయడంతో దేవునిమాన్యం భూములు అక్రమణకు గురవుతున్నాయని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి టి.వాసుదేవరావు శనివారం తహసిల్దార్ కార్యాలయానికి విచ్చేసి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, మంజూరు చేసిన పట్టాలు రద్దు చేయాలని కోరారు. భూములు సర్వే చేసి తమ శాఖకు అప్పగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వివాదాస్పంగా మారిన ఈ భూములపైన... రెవెన్యూశాఖ మాయజాలంపై ప్రజల్లో జోరుగా చర్చ జరుగుతోంది. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ వివాదం సాగుతోంది. పట్టాలు పొందిన లబ్ధిదారులు తమ స్థలాలంటూ ఆక్రమిస్తుంటే తమ భూములంటూ దేవదాయశాఖ వాదిస్తోంది. 2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ భూములు అక్రమణలకు గురి కాకుండా మాజీ మంత్రి గౌతు శివాజీ చర్యలు చేపట్టారు. ఆక్రమణలు సరికాదంటూ అప్పట్లో రెవెన్యూ శాఖ అధికారులకు సూచించారు. మరలా ఇవే భూములు వైసీపీ పాలనలో ఆక్రమణలు జరిగితే మాజీ మంత్రి అప్పలరాజు ఆక్రమణలు జరగకుండా అధికారులను ఆదేశించి చర్యలు చేపట్టారు. తిరిగి ఇవే భూములు గత రెండు రోజులుగా పట్టాదారులు స్వాధీనం చేసుకుంటున్నారనీ ఈవో టీ వాసుదేవరావు రెవెన్యూశాఖకు ఫిర్యాదు చేశారు. దేవదాయ శాఖ ఫిర్యాదుల పరంపర కొనసాగిస్తున్నప్పటికీ దేవాలయ భూములు అప్పగించకుండా రెవెన్యూ శాఖ తాత్సారం చేస్తోంది. తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోనని ఆలయభూములపై రెవెన్యూ అధికారులు సర్వే చేయడం లేదు. వివరాల్లోకి వెళితే... మందస మేజరు పంచాయతీలో దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన 112/1, 112/2 ,112/3, రీసర్వే నెంబర్లలో నాలుగు ఎకరాల 67 సెంట్లు భూమి ఉంది. రట్టి గ్రామంలో వల్లభనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూములు ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం వీటి విలువ సుమారు రూ.15

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రాజకీయ లబ్ధికోసం కాదు,
వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నా...
నన్నొదిలేయ్‌రా నాయనా!

తీరం... కలవరం!

- 2040 నాటికి 1.02 శాతం భూభాగంలో సముద్ర మట్టం పెరగనుందా...
- సమీప నివాసాలు సురక్షితమేనా?
- విశాఖ ప్రాంత వాసుల్లో ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ సాగర తీరం సురక్షితమేనా? సమీప నివాసాలకు ముప్పు ఉందా? ఇది ఇప్పుడు ఆ ప్రాంత వాసుల్లో నెలకొన్న ఆందోళన. సుందరమైన సాగర తీరంలో అందమైన విల్లాలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్న వారికి పిడుగు లాంటి వార్త వచ్చి పడింది. బీచ్ రోడ్డు వెంబడి కోట్లాది రూపాయల ఖరీదైన నివాసాలు కట్టుకున్న వారిలో మరో 15 సంవత్సరాల తర్వాత ముప్పు తప్పదా అనే ఆందోళన నెలకొంది. వాతావరణ మార్పులతో సముద్ర మట్టాలు శరవేగంగా పెరుగుతున్నాయి. ఈ పరిణామం దేశంలోని తీర నగరాలకు ముప్పుగా పరిణమించనుందా, ఆ జాబితాలో తమ నగరం కూడా ఉందా అన్న భయం ప్రస్తుతం విశాఖ వాసుల్లో ఉంది. ఇటీవల బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ 2040 నాటికి తీర ప్రాంతంలో 1.02 శాతం నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది దీంతో సముద్ర తీర ప్రాంతంలో కోట్లాది రూపాయలతో విల్లాలు, ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన

- మిగతా 2 లో

బ్రెజిల్‌లో కుప్పకూలిన విమానం

62 మంది సజీవ దహనం

2లో

బ్రెజిల్‌లో కుప్పకూలిన విమానం

బ్రెసిలియా: బ్రెజిల్‌లోని సావో పౌలోలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. వోయేపాస్ ప్లేన్ ఏటీఆర్ 72 కుప్పకూలింది. మొత్తం 62 మంది మృతిచెందారు. గ్వారుహోస్‌లోని సావో పౌలో అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విన్‌హెడో నగరానికి ఉదయం 11.50 గంటలకు బయల్దేరిన ఈ విమానం మధ్యాహ్నం 1.40 గంటలకు గమ్యస్థానానికి చేరుకోలిగానీ ప్రమాదానికి గురైంది. విమానంలో 58 మంది ప్రయాణికులు, నలుగురు

62 మంది సజీవ దహనం

సిబ్బందితో కలిపి మొత్తం 62 మంది ఉన్నారు. ప్రమాదానికి గురైన ఈ విమానం తొలుత గాల్లో చక్కర్లు కొట్టి వేగంగా కిందకు దూసుకొచ్చిందని, కింద పడిన వెంటనే ఫ్యుయల్ ట్యాంక్ నుంచి మంటలు చెలరేగి విమానం దగ్ధమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. 62 మందిలో ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగల్లేదన్నారు. గేటెడ్ కమ్యూనిటీలో విమానం కూలడం కలకలం రేపింది. ఘటనాస్థలంలో ఎవరికీ గాయాలు కాలేదు. సహాయక చర్యలకు చలి, వర్షం ఆటంకం కలిగించినప్పటికీ మృతదేహాలను అగ్నిమాపక

దళం, సహాయక సిబ్బంది వెలికితీశారు. కాగా, సావో పౌలో సిటీ సెంటర్ వద్ద హైవేకు దగ్గరల్లో విమానం కూలిందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన విమానం 2010లో తయారైనట్లు 'ఎక్స్'లో ఫ్లైట్ రాడార్ 24 సంస్థ పేర్కొంది. ప్రపంచంలోనే అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాల్లో ఒకటిగా తాజా ఘటన నిలిచింది.

అధ్యక్షుడు లూలా దిగ్భ్రాంతి

ఈ ఘటనపై బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మొత్తం 62 మంది దుర్మరణం చెందినట్లు తెలిపారు. రెండు నిమిషాలు మౌనం వహించి మృతులకు నివాళు లర్పించాలని ప్రజలకు సూచించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఆయనకు ఈ దుర్వార్త అందింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆయన ఆదేశాలిచ్చారు.

అబు సయ్యద్ స్ఫూర్తితో ముందుకు...: యూనస్

ఢాకా: విద్యార్థి ఉద్యమకారుడు అబు సయ్యద్ పోరాటశైలి అనుసరణీయమని బంగ్లాదేశ్ ఆపద్ధర్మ నాయకుడు మహమ్మద్ యూనస్ అన్నారు. మత సామరస్యానికి, ఐక్యతకు పిలుపునిచ్చారు. కొత్త బంగ్లాదేశ్ నిర్మాణమే బాధ్యతని తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో సయ్యద్ ముందుండి పోరాడారన్నారు. రంగ్‌పూర్‌లోని బేగం రుకయ్య యూనివర్సిటీకి చెందిన సయ్యద్ (25) జులై 16న పోలీసుల కాల్పుల్లో చనిపోయిన మొదటి ఆందోళనకారుడు. ఆయన కుటుంబాన్ని యూనస్ శనివారం పరామర్శించారు. 'అబూ సయ్యద్ తరహాలోనే మనం ఉండాలి. అబు సయ్యద్ తల్లి... అందరికి అమ్మే. ఆమెను మనం కాపాడుకోవాలి. అలాగే సయ్యద్ సోదరులు, సోదరీమణులకు రక్షణ కల్పించాలి. ఇది మనమంతా కలిసికట్టుగా చేయాలి' అని యూనస్ పిలుపునిచ్చారు. సయ్యద్ కుటుంబాన్ని కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతన బంగ్లాదేశ్ నిర్మాణ బాధ్యత ప్రతి బంగ్లాదేశీదన్నారు. 'అబు సయ్యద్ ఇక ఒక కుటుంబానికి చెందిన బిడ్డ మాత్రమే కాదు... బంగ్లాదేశ్ కుటుంబాలందరి బిడ్డ. పిల్లలు ఎదిగి స్కూళ్లు, కాలేజీలకు వెళతారు. వారందరికీ అబూ సయ్యద్ గురించి తెలుస్తుంది. మనమే వారికి చెబుతాం. న్యాయం కోసం నేను సైతం పోరాడతా. బంగ్లాదేశ్‌లోని ప్రతి కుటుంబంలో అబు సయ్యద్ ఉంటాడు' అని యూనస్ అన్నారు.

హాంఫట్!

(మొదటిపేజీ తరువాయి)

కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన భూములు కాజేసేందుకు రాజకీయ కుట్ర జరుగుతుందన్న ప్రచారం జోరందుకుంది. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఈ భూముల రికార్డులు తారు మారు చేసి ప్రభుత్వ భూములుగా చిత్రీకరించి రెవెన్యూ శాఖ డబ్బులు గుంజుకుని పట్టాలు మంజూరు చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే పట్టాలు పొందిన వారిలో టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉండటం విశేషం. రెవెన్యూ కార్యాలయం పౌరసేవలు అందించకుండా భూ అక్రమణదారులకు వేదికగా తయారైంది. మండలంలోని బాలిగాం -హరిపురం పాత జాతీయ రహదారి పక్కనే సుమారు 10 ఎకరాల విస్తీర్ణం గల అప్పయ్య చెరువు (సాగునీటి వనరు) స్థలాన్ని రెవెన్యూ శాఖ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జిరాయితీగా మార్చేశారు. ఈ చెరువు స్థలాన్ని ఆక్రమణ దారులు పూర్తిగా ఆక్రమించేశారు.

ఇది సుమారు రూ.వంద కోట్లు ఉంటుందని అంచనా. ఈ చెరువును గతంలో ఉపాధి నిధులతో అక్రమణదారులు పూర్తిగా పూడ్చేశారు. ఈ చెరువు గర్భం అక్రమణకు గురి కాకుండా అయిదేళ్ల క్రితం ఈ జిల్లాలో కలెక్టర్ గా పనిచేసిన జె.నివాస్ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ సాగునీటి చెరువుగా గుర్తించి బోర్డులు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆయన బదిలీపై వెళ్లిన వెంటనే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు అప్పయ్య చెరువును జిరాయితీ స్థలంగా మార్చేశారంటే ఈ కార్యాలయం ఎవరి కోసం పనిచేస్తోందన్న విషయంపై ఈ ప్రాంత ప్రజల్లో చర్చ సాగుతోంది. భూ మాయతతంగంపై చర్యలు తీసుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ప్రజలు కోరుతున్నారు.

52 జిల్లాల్లో 205 ఘటనలు

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు: యూనస్‌కు హిందూ సంఘాల లేఖ

ఢాకా: షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు పేట్రేగిపోయాయి. 52 జిల్లాలో 205 ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ మేరకు హిందూ బుద్ధిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్, బంగ్లాదేశ్ పూజా ఉద్జాపన్ పరిషత్ వెల్లడించాయి. మైనారిటీలపై దాడులకు సంబంధించి మహమ్మద్ యూనస్‌కు బహిరంగ లేఖ రాశాయి. మైనారిటీలకు రక్షణ కల్పించాలని కోరాయి. నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, ఇళ్లు, ప్రార్థనా స్థలాలకు పహారా

కాస్తున్నామని యూనస్‌కు దృష్టికి ఈ సంస్థల ప్రతినిధులు తీసుకెళ్లారు. మతసామరస్యాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మైనారిటీల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, దేశంలో హింసను అరికట్టాలని కోరారు. కొత్త శకానికి నాయకుడిగా యూనస్‌ను కొనియాడారు. ఆయన నాయకత్వాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు, సంస్కరణలకు పెద్దపీట వేస్తారని ఆకాంక్షిస్తున్నట్లు లేఖలో వెల్లడించారు. శాంతిభద్రతల పునరుద్ధరణకు ఆపద్ధర్మ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు విదేశీ వ్యవహారాల సలహాదారు హుస్సేన్ వెల్లడించారు. దేశాన్ని తిరిగి గాడిలో పెడతామని ప్రకటించారు. విద్యార్థుల కోటా వ్యతిరేకోద్యమం హింసాత్మకంగా మారి 560 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

తీరం... కలవరం!

(మొదటిపేజీ తరువాయి)

యజమానులు భయపడుతున్నారు. సముద్ర అందాలను ఆస్వాదించాలని తీరానికి సమీపంలో సుందరంగా నిర్మించుకున్న నివాసాలకు భవిష్యత్‌లో ముప్పు తప్పదన్న హెచ్చరికలపై అనేకమంది విస్తృతంగా చర్చించుకుంటున్నారు. భూ తాపం ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. తీర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. గడిచిన 30 ఏళ్లుగా సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ అండ్ క్లైమేట్ చేంజ్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. 2040 నాటికి కల్లా విశాఖ తీరంలో 1.02 శాతం భూభాగం నీట మునిగే అవకాశం ఉందని బెంగళూరుకు చెందిన సంస్థ తాజా అధ్యయనం వెల్లడించింది. 1992 నుంచి 2021 వరకు ఏడాదికి 0.18 సెంటీమీటర్ల వంతున మొత్తం 2.38 సెంటీమీటర్ల మేర సముద్ర మట్టం పెరగడంతో తీర ప్రాంతంలోకి చొచ్చుకొచ్చింది. ఇదే విధంగా 2040 నాటికి సముద్రమట్టం 16.7 నుంచి 18.3 సెంటీమీటర్ల మేర పెరిగే అవకాశం ఉందని, తీరంలో సుమారు 1.02 శాతం ప్రాంతం ముంపునకు గురవుతుందని సంస్థ తెలిపింది. సముద్ర మట్టాలు పెరుగుదల తీర ప్రాంతాలకు ముప్పు అనే అంశంపై బెంగళూరుకు చెందిన సంస్థ (సీఎస్ టీఈపీ) అధ్యయనం చేసింది. దేశంలో ముంబై తర్వాత ఎక్కువగా హల్దియా, విశాఖ నగరాలే సముద్ర ముంపునకు గురవుతాయని హెచ్చరించింది. విశాఖలో పోర్టు నుంచి మంగమారిపేట వరకు తీర ప్రాంతంపై ఈ బృందం అధ్యయనం చేసింది. 2040 కల్లా తీర ప్రాంతంలో 6.96 చదరపు కిలోమీటర్లు నీట మునిగే ప్రమాదం ఉందని అంచనా వేసింది. వ్యవసాయ భూములు, పచ్చిక బయళ్లు, పారిశ్రామిక ప్రాంతంతో పాటు నీటి వనరుల ప్రాంతాలు నీట మునగనున్నాయి. దీంతో విశాఖ పోర్టు, తెన్నేటి పార్క్, రుషికొండ, మంగమారిపేటలో సముద్రానికి దగ్గరగా ఉన్న ప్రాంతాలు నీట మునుగుతాయని ఈ సంస్థ అంచనా వేసింది. పోర్టు నుంచి మంగమారిపేట వరకు తీర ప్రాంతం ఇప్పటికే చాలావరకు కోతకు గురై నీట మునిగింది. ఏటా విశాఖ తీరంలో సముద్రం ముందుకు వస్తోంది. కోస్టల్ బ్యాటరీ, సబ్ మెరైన్, వైఎంసీఏ ఎదురుగా సముద్ర తీరం కోతకు గురవుతోంది. ఆర్కే బీచ్‌లో స్టాండింగ్ పాయింట్‌కు ఒకప్పుడు సముద్రం చాలా దూరం ఉండేదని, ఇప్పుడు రుతుపవన సీజన్‌లో నీరు తాకుతోందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. మానవ అభివృద్ధి కార్యక్రమాలే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావంతో పెరిగిన భూతాపం వల్ల సముద్ర మట్టాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఇందుకు ఆసియా దేశాలు మినహాయింపు కాదని ఐపీసీసీ ఇప్పటికే స్పష్టం చేసింది. సముద్ర మట్టాలు పెరగడంతో ముంబై తర్వాత ఎక్కువగా ప్రమాదానికి గురయ్యే నగరం విశాఖనే అని తాజా అధ్యయనం తెలుపుతోంది. విమానాశ్రయం పక్కన ఉన్న మెహాద్రిగడ్డలోకి నీరు ప్రవేశిస్తే ఆ ప్రాంతంలో చెట్లు, మర అడవులు ముంపునకు గురవుతాయి. భూగర్భ జలాలు ఉప్పు నీటిగా మారతాయి. బీచ్ రోడ్ ఇప్పటికే కోతకు గురవుతోంది. ఈ క్రమంలో బీచ్ రోడ్ ప్రమాదంలో పడనుంది. సముద్రపు కోతల కారణంగా బీచ్ అస్తవ్యస్తమైంది. చెట్లను పెంచడం ద్వారా నష్టాన్ని కొంత మేర తగ్గించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి విశాఖ పరిధిలో 131 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది. తీరం వెంబడి 43 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వాటిలో 15 గ్రామాల వద్ద తీరం తరుచూ కోతకు గురవుతోంది. 2014 హుదూద్ తుపాను సమయంలో ఆర్కే బీచ్ పరిధిలో కిలోమీటర్ల మేర తీరం దెబ్బతింది. వాతావరణం వేడెక్కుతుండటంతో మంచుకొండలు కరగటమే సముద్ర మట్టాలు పెరగడానికి కారణమని నిపుణులు అంటున్నారు. విశాఖ తీరంలో కొండలు సముద్రంలోకి చొచ్చుకుని ఉండటమూ కోతకు కారణం అవుతోందని అంటున్నారు. యారాడ కొండ కారణంగా ఇసుక సహజ ప్రయాణానికి ఆటంకం ఏర్పడుతోంది. దీంతో యారాడ కొండకు మరోవైపు ఉన్న ఆర్కే బీచ్, సబ్ మెరైన్ బీచ్ మ్యూజియం వద్ద కోత ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఒక విశాఖ మాత్రమే కాదని కాకినాడ, మచిలీపట్నం, యానాం వంటి తీరాలకు సైతం ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. అయితే భవిష్యత్‌లో మార్పులు వచ్చి గ్లోబల్ వార్మింగ్ తగ్గితే సముద్రపు కోత తగ్గే అవకాశాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు. లేదంటే వినాశనం తప్పదని హెచ్చరిస్తున్నారు.

నిజాయతీకి ప్రతీక కేజ్రీవాల్

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలను మోదీ సర్కారు వినియోగించుకుంటుందని విమర్శించారు. మోదీ సర్కారు నియంతృత్వం ఎంతోకాలం సాగదని హెచ్చరించారు. కేంద్రంలోని మోదీ సర్కార్ ఆప్ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతుందని ఆయన మండిపడ్డారు. మనీశ్ సిసోడియా శనివారం న్యూఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే తమకు నిజమైన బలమన్నారు. తనకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం నియంత పాలనకు చెంప పెట్టు అని సిసోడియా పేర్కొన్నారు. తన బెయిల్‌పై వాదనలు కొనసాగించిన తన తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతకుముందు రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ సమాధిని మనీశ్ సిసోడియా సందర్శించి... ఘనంగా నివాళులర్పించారు. కన్నాట్ ప్లేస్‌లోని హనుమాన్ దేవాలయాన్ని కూడా ఆయన సందర్శించారు. గతేడాది ఫిబ్రవరి 26వ తేదీన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఉప ముఖ్యమంత్రి హోదాలో మనీశ్ సిసోడియాను ఈడీ అరెస్ట్ చేసింది. తీహార్ జైలుకు తరలించింది. అనంతరం ఇదే కేసులో ఆయనపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసుల్లో బెయిల్ కోసం ఆయన చాలాసార్లు కోర్టులను ఆశ్రయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆగస్ట్ 9వ తేదీన సుప్రీంకోర్టు మనీశ్ సిసోడియాకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన శుక్రవారం విడుదలయ్యారు.

భార్యతో సెల్ఫీ...ఎక్స్‌లో పోస్ట్

జైలు నుంచి విడుదలైన మనీశ్ సిసోడియా శనివారం ఉదయం తన భార్య సీమాతో కలిసి టీ తాగుతూ... సెల్ఫీ దిగారు. ఆ సెల్ఫీతోపాటు 17 నెలలకు లభించిన స్వేచ్ఛ తర్వాత ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాను. భారతీయులందరికీ రాజ్యాంగం స్వేచ్ఛగా జీవించే హక్కు కల్పించింది. ప్రతి ఒక్కరితో కలిసి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునే హక్కును దేవుడు అందరికీ కల్పించాడంటూ కామెంట్ జత చేసి తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. శుక్రవారం జైలు నుంచి విడుదలైన మనీశ్ సిసోడియా... కేజ్రీవాల్ నివాసానికి వెళ్లి అయన తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారని, బలాబలాల్లో వ్యత్యాసం అధికంగా ఉన్నందున పోటీ చేసి అభాసుపాలయ్యే కంటే వదిలేయడమే మంచిదని సూచించినట్లు తెలిసింది. వైసీపీ ఓటర్లలో ఎంత మంది కూటమి వైపు మొగ్గు చూపే అవకాశం ఉందన్న అంశంపై నియోజకవర్గాల వారీ చంద్రబాబు ఆరా తీశారు. రూరల్ పరిధిలోని ఓటర్ల పైన మరింత సమాచారం కోరారు. దీనిపై ఆరుగురు ముఖ్య నేతలతో ఒక కమిటీ వేసి, గెలుపు అవకాశాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. అలాగే బొత్స సత్యనారాయణను అన్ని విధాలా ఎదుర్కోగల సత్తా ఉన్న అభ్యర్థి ఎవరైతే బావుంటుందనే దానిపైనా చంద్రబాబు ఉత్తరాంధ్ర నేతలతో చర్చించారు. బొత్స విజయనగరం జిల్లాకు చెందిన నేత కావడం వల్ల స్థానికేతర ప్రభావం పనిచేసే అవకాశం ఉందని, అందువల్ల కూటమి తరపున స్థానిక నేతను నిలబెడితే లాభిస్తుందని కొందరు సూచించారు. దీంతో పీలా గోవింద్, గండి బాబ్జీ, పీవీజీ కుమార్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఇక వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలి ఎన్నిక కావడంతో దీనిని గెలవడం ద్వారా ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రజలకు వెల్లడి చేయడానికి మంచి అవకాశంగా ఆయన భావిస్తున్నారు. అలాగే నూటికి నూరుశాతం గెలవడానికి కూడా పార్టీకి బలం ఉన్నందున, దానిని కాపాడుకుని విజయం సాధించేందుకు అవసరమైన వ్యూహాన్ని ఇప్పటికే జగన్ సిద్ధం చేసుకున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున వారిని ఇప్పటికే అండర్ గ్రౌండ్‌కి తరలించి కాపాడుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో క్యాంపు ఏర్పాటుకు నేతలను ఆదేశించారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ పదికి పది స్థానాలను టీడీపీ కూటమి గెలుచుకోవడాన్ని జగన్ సీరియస్‌గా పరిగణించారు. కేవలం నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, ఏమాత్రం శ్రద్ధ తీసుకున్నా ఓడిపోయే వారం కాదని జగన్ ముఖ్యనేతల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటర్లుగా ఉన్న వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. పెందుర్తి, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తమ కుటుంబసభ్యులతో గురువారం తాడేపల్లి నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి జగన్ మాట్లాడుతూ ప్రత్యర్థి పార్టీలు ఐదు లక్షలు ఇస్తాం, పది లక్షలు ఇస్తామని బేరసారాలు చేస్తాయని, వాటికి లొంగిపోయి అమ్ముడుపోవద్దని సూచించారు. 2014లో వైసీపీ నుంచి గెలిచి, టీడీపీలోకి వెళ్లిన 23 మంది ఎమ్మెల్యేలకు రూ.20 కోట్ల చొప్పున ఇస్తామని నమ్మించి, కేవలం అడ్వాన్సు మాత్రమే ఇచ్చి వదిలేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా విశాఖ జిల్లా స్థానిక ప్రజాప్రతినిధులకు అడ్వాన్సులతోనే సరిపుచ్చుతారని హెచ్చరించారు. అప్పుడు టీడీపీలోకి వెళ్లినవారు మోసపోయామని తెలిసి వెనక్కి వస్తామంటే రాజకీయ విలువల కోసం తాను రావద్దన్నానని, ఆ తర్వాత వారికి రాజకీయ భవిష్యత్ లేకుండా పోయిందని తెలిపారు. మరోవైపు టీడీపీ కూటమికి వారెవరూ అందుబాటులో లేకుండా కుటుంబాలతో పాటు దక్షిణ భారత యాత్రకు పంపే ఏర్పాట్లు చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే అరకు, పాడేరు నియోజకవర్గాలకు చెందిన వారిని బెంగళూరు తీసుకెళ్లినట్లు వైసీపీ నేతలు చెబుతున్నారు. వైసీపీ లెక్కల ప్రకారం ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో 615 ఓట్లు ఉన్నాయి. మొత్తం 841 ఓట్లకు గాను వైసీపీకి 75 శాతం బలం ఉండగా, అధికార కూటమికి కేవలం 215 ఓట్లు మాత్రమే ఉన్నాయి. అయితే ఎన్నికల ముందు, ఆ తర్వాత కొందరు వైసీపీ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రస్తుతం మరికొందరు వైసీపీ క్యాంపు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయినప్పటికీ గెలుపు విషయంలో ఢోకా లేదని వైసీపీ నేతలు దీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ శనివారం తాజాగా విశాఖ ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో సమావేశమై 12వ తేదీన నామినేషన్ వేస్తానని ప్రకటించారు. తన గెలుపు కోసం వైసీపీ నేతలంతా ఐక్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. మొత్తానికి వైసీపీ గెలుపు దీమాతో దూకుడుగా వ్యవహరిస్తుండగా, కూటమి మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

ఇది అసాధారణ విపత్తు

(మొదటిపేజీ తరువాయి)

వంతెననూ పరిశీలించారు. ఆర్మీ, సహాయక సిబ్బంది పనిని మెచ్చుకున్నారు. ఏరియల్ సర్వే తర్వాత కాల్‌పెట్టలో హెలికాప్టర్ దిగిన ఆయన అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాలకు వెళ్లి బాధితుల తరలింపు, సహాయక చర్యల గురించి ఆరా తీశారు. వెల్లరిమాల జీవీహెచ్ఎస్ఎస్ స్కూలుకు వెళ్లి అక్కడ జరిగిన నష్టం గురించి, విద్యార్థుల చదువులు, వారి భవిష్యత్ ప్రణాళికల గురించీ తెలుసుకున్నారు.32 మంది విద్యార్థులు చనిపోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. డాక్టర్ మూపెన్స్ మెడికల్ కాలేజీ హాస్పిటల్ (విమ్స్)లో చికిత్స పొందుతున్న 49 మందిని మోదీ పరామర్శించారు. ఎనిమిదేళ్ల అవంతికతో పాటు ఆరుగురు రోగులతో మాట్లాడి, ఓదార్చారు. కాల్‌పెట్ట కలెక్టరేట్‌కు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్నారు. ఉన్నతాధికారులు, గవర్నర్, సీఎంతోనూ చర్చలు జరిపారు. వాయడాన్ ఘటనను ఎల్3 విభాగంలో పెట్టి జాతీయ విపత్తుగా ప్రకటించాలని, శిథిలమైన ప్రాంతాల పునర్నిర్మాణానికి రూ.2వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కేరళ రాష్ట్రం డిమాండ్ చేస్తోంది. సమీక్షా సమావేశం 40 నిమిషాల పాటు జరిగింది. అనంతరం కన్నూర్ విమానాశ్రయం నుంచి మోదీ తిరుగు పయనమయ్యారు. కాగా, కేరళ విపత్తులో 226 మంది చనిపోగా దాదాపు 130 మంది ఆచూకీ లేని విషయం తెలిసిందే.

ధన్యవాదాలు మోదీజీ: రాహుల్

వయనాడ్‌లో పర్యటించినందుకుగాను ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కృతజ్ఞతలు తెలిపారు. విపత్తు తీవ్రతను చూసిన తర్వాత దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించకుండా మోదీ ఉండలేరంటూ దీమాగా చెప్పారు. 'వయనాడ్‌కు వెళ్లి విపత్తు పరిస్థితిని స్వయంగా పరిశీలించినందుకు మీకు కృతజ్ఞతలు మోదీజీ. మీరు తీసుకున్నది మంచి నిర్ణయం' అని ఎక్స్‌లో రాహుల్ పేర్కొన్నారు. అక్కడ జరిగిన విధ్వంసాన్ని కళ్లారా చూసిన తర్వాత దానిని జాతీయ విపత్తుగా ప్రకటించకుండా మోదీ ఉండలేరన్న నమ్మకం ఉన్నట్లు ట్వీట్ చేశారు. సోదరి ప్రియాంక గాంధీతో కలిసి రాహుల్ వయనాడ్‌లో పర్యటించి బాధితులను పరామర్శించారు. దీనిని జాతీయ విపత్తుగా ప్రకటించాలంటూ లోక్‌సభలో డిమాండ్ చేశారు.

రామచంద్రరావు మృతి

(మొదటిపేజీ తరువాయి)

సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి హయాంలో రామచంద్రరావు పార్టీ ఆఫీస్ కార్యదర్శిగా, కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

మానవతావాది రామచంద్రరావు

మానత్వం మూర్తిభవించిన గొప్ప మనిషి రామచంద్రరావు అని సీపీఐ నాయకులు, ప్రముఖులు కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. రామచంద్రరావు కమ్యూనిస్టు పార్టీ కార్యాలయ కార్యదర్శిగా ఆరు దశాబ్దాల పాటు నిబద్ధతతో సేవలందించారని సీపీఐ పూర్వపు ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి కొనియాడారు. కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో డీఎస్ రామచంద్రరావు భౌతికకాయానికి సురవరం సుధాకర్ రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట రెడ్డి, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, భారత మాజీ రాయబారి డాక్టర్ టి.సురేశ్‌బాబు, ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు డాక్టర్ బీవీ విజయలక్ష్మి, మాజీ ఎంఎల్‌సీ పీజే చంద్రశేఖర రావు, సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, డాక్టర్ డీఎస్ కుమార్, డాక్టర్ ప్రతిభ, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రుల సందర్శనార్థం రామచంద్రరావు భౌతికకాయాన్ని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌కు తీసుకువచ్చారు. చాడ వెంకట రెడ్డి, పల్లా వెంకట రెడ్డితో పాటు పార్టీ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పార్టీ పతాకాన్ని రామచంద్రరావు భౌతికకాయంపై కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, నవచేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ మధుకర్, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, అరసం జాతీయ నాయకులు డాక్టర్ ఎస్‌వీ సత్యనారాయణ తదితరులు రామచంద్రరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో చాడ వెంకట రెడ్డి, కె.రామకృష్ణ మాట్లాడుతూ రామచంద్రరావు పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి, ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడారు.

నారాయణ సంతాపం

డీఎస్ రామచంద్రరావు మరణం పట్ల హృదయవేదనతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సంతాప ప్రకటన విడుదల చేశారు. కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులకు సహాయక చర్యల కార్యక్రమంలో ఉన్న తాను రామచంద్రరావు భౌతికకాయాన్ని చివరిగా చూడలేకపోతున్నందుకు బాధగా ఉందని తెలిపారు.

హామీలపై దృష్టిపెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

దీవెనా లేదు, సున్నా వడ్డీ లేనే లేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అక్క చెల్లెమ్మకు కూడా నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు జాడే లేదు. ప్రతి ఇంటికీ ఉద్యోగం లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఊసే లేదు. చివరకు రూ.20 వేలు ఇస్తానన్న మత్స్యకార భరోసా అడ్రస్సే లేదు. పేదలకు అత్యవసరమైన ఆరోగ్యశ్రీ చెల్లింపులు రూ.1,600 కోట్లు పెండింగ్. ఇంటికి వచ్చి పెన్షన్ ఇచ్చే విధానం ఆగిపోయింది. ఇంటికి వచ్చే రేషన్ నిలిచిపోయింది. వలంటీర్లను మోసం చేశారు, విత్తనాల కోసం రైతులు క్యూలో నిలబడే పరిస్థితిని తీసుకు వచ్చారు. పంటలకు ఉచిత బీమా ఎగరగొట్టారు. బడుల్లో టోఫెల్ పీరియడ్ రద్దు చేశారు. విద్యా కానుక కిట్లు పంపిణీ అరకొరగానే, అది కూడా అస్తవ్యస్తం. మధ్యాహ్న భోజనం పథకంలో రోజుకో మెనూ పద్ధతి పోయింది. ఇంగ్లీషు మీడియం గాడితప్పింది, బడుల్లో, గ్రామాల్లో పరిశుభ్రత పడకేసింది. శాంతిభద్రతలు పూర్తిగా గాడి తప్పాయి. రెడ్‌బుక్ రాజ్యమేలుతోంది. రాష్ట్రం మూడు హత్యలు, ఆరు విధ్వంసాలుగా వర్ధిల్లుతోంది. మహిళలకు రక్షణే లేదు. రెండున్నర నెలల్లోనే ప్రజలను ఇంతలా దగా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇకనైనా అవాస్తవాలు మాని ఇచ్చిన హామీలు అమలు చేయాలని జగన్ డిమాండ్ చేశారు.

స్టీల్ ప్లాంట్ల ప్రైవేటీకరణకు కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

ఉదహరించారు. 'నిన్న రాజ్యసభలో ఉక్కు మంత్రి కుమార స్వామి మోదీ ప్రభుత్వం నాలుగు స్టీల్ ప్లాంట్లను ప్రైవేటీకరించడానికి ప్రయత్నించి విఫలమైందని, ప్రస్తుతం మరో రెండు ప్లాంట్లను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తోందని' 'ఎక్స్'లో జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ ఆరింటిలో ఏదీ ప్రైవేటీకరణ అవసరం లేదని ఆయన వాదించారు. అయితే ఈ పీఎస్‌యూలు ఇప్పుడు నిష్క్రియాత్మక స్థితిలో తెలిపారు. 'ప్రభుత్వం వాటిపై పెట్టుబడి పెట్టదు. వాస్తవానికి ఈ యూనిట్లను నష్టాల్లోకి నెట్టడానికి, ప్రైవేటీకరణ వ్యవహారాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం వాస్తవానికి క్రమపద్ధతిలో ప్రయత్నిస్తున్నట్లు రుజువులు ఉన్నాయి' అని కాంగ్రెస్ నాయకుడు చెప్పారు. ఉద్యోగులు వేతనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని, కాలక్రమేణా సరఫరాదారులు మారతారని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ వయనాడ్‌లో ఉండటం చాలా సంతోషకరమని, 15 నెలలకు పైగా బాధను అనుభవిస్తున్న మణిపూర్‌ను కూడా సందర్శించేం దుకు ఆయనకు సమయం దొరుకుతుందని, అందుకు మొగ్గు చూపుతారని జైరాం రమేశ్ మరొక పోస్ట్‌లో పేర్కొన్నారు.

కేరళలో కొండచరియలు విరిగిపడిన వయనాడ్‌లో మోదీ ఉన్న రోజున ప్రతిపక్ష పార్టీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'జీవ సంబంధయేతర ప్రధాన మంత్రి ఈరోజు వయనాడ్‌లో ఉండటం విశేషం. ఇది వినాశకరమైన విషాదం. దీని తర్వాత ఆయన (మోదీ) మరోసారి యుద్ధాన్ని ఆపడానికి ఉక్రెయిన్‌ను సందర్శించాల్సి ఉంది. మణిపూర్‌ను కూడా సందర్శించడానికి ఆయనకు సమయం దొరుకుతుందని ఆశిస్తున్నాను' అని తెలిపారు. అనేక సార్లు పిలుపునిచ్చినా హింసాకాండకు గురైన మణిపూర్‌ను ప్రధాని సందర్శించకపోవడంపై కాంగ్రెస్ విమర్శల దాడి చేస్తోంది.

పూర్వ వైభవానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ సంఘాల అధ్యక్షులు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ సభ్యత్వ నమోదు, కిందిస్థాయి నుంచి నాయకత్వాన్ని తయారు చేసేందుకు అనుసరించాల్సిన విధానాలు తదితర అంశాలపై వారితో చర్చించారు. చంద్రబాబు మాట్లాడుతూ ప్రత్యేక రాజకీయ పరిస్థితుల వల్ల 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో తటస్థంగా ఉండాలని నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వారికి వివరించారు. ఇక్కడి మెజారిటీ ప్రజలు, పార్టీ అభిమానులు ఏపీకి వచ్చి అక్కడి ఎన్నికలలో తన గెలుపుకోసం పని చేశారని, వారందరికీ అభినందనలు తెలిపారు. 2024 ఎన్నికలలో ఏపీలో టీడీపీకి వచ్చిన మెజారిటీ, పార్టీ పెట్టినప్పటి నుంచి ఇంత వరకు ఎప్పుడూ రాలేదన్నారు. 1982లో మంచి ఊపు వచ్చింది. 1994లో విప్లవం వచ్చింది. ఆనాడు అప్పటి కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదు. అది ఒక చరిత్ర. 2024 ఏపీ ఎన్నికలలో కూడా అంతకంటే ఘన విజయం నమోదు చేసుకోవడమే గాక... ప్రతిపక్షానికి 11 సీట్లే ప్రజలు ఇచ్చారు. యువతను అభివృద్ధి చేసుకోవాలని చంద్రబాబు మార్గనిర్దేశనం చేశారు.

విశాలాంధ్ర
3
ఆదివారం
11 ఆగస్టు 2024

108 డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్ర ప్రదేశ్‌లో 108 అంబులెన్స్ సర్వీస్‌లో నిరంతరం కష్టపడి పని చేస్తున్న అంబులెన్స్ డ్రైవర్లు, ఈఎంటీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో 108లో పనిచేసే కార్మికుల సమావేశం శనివారం జరిగింది. ముఖ్య ఆహ్వానితులుగా రవీంద్రనాథ్, ఏఐటీ యూసీ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 సర్వీస్‌లో పని చేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. యాజమాన్యం నుంచి రావలసిన ఆర్థిక పరమైన సౌకర్యాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో యూనియన్‌ను బలోపేతం చేసి కార్మికులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.రవీంద్రనాథ్, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర అధ్యక్షులుగా అమలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.ఎం.సుభాని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా వీర బ్రహ్మం, సబర్నాథ రెడ్డి, ఎస్.కె.నాగూర్, సహాయ కార్యదర్శులుగా వినోద్, నాగ ప్రసాద్, రాజు కోశాధికారిగా ఎల్.అనసూయ, కమిటీ సభ్యులుగా మరో ఐదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుండగులను శిక్షించండి

అంబేద్కర్ స్మృతివనంపై దాడికి డీహెచ్‌పీఎస్ ఖండన

విశాలాంధ్ర-విజయవాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మృతి వనంలో గురువారం రాత్రి జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. విగ్రహానికి కూత వేటు దూరంలో పోలీసు అధికారి కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరం అన్నారు. ప్రభుత్వం, పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వంపై అనేక అనుమానాలు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 26 జిల్లాలలోని డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టతామని హెచ్చరించారు.

ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 6వ రాష్ట్ర సర్వసభ్య సమావేశం మాకినేని బసవ పున్నయ్య భవనం నందు సంఘ అధ్యక్షుడు కె.వి.రమణ, ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్ అధ్వర్యంలో శనివారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరయిన సభ్యులు రాబోయే మూడు సంవత్సరాలకుగాను నూతన కమిటీకి 18 మందిని, ప్రాంతీయ కమిటీకి 24 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీకి నూతన అధ్యక్షుడుగా కె.వి.రమశ్రీ, ప్రధాన కార్యదర్శిగా ఎం.సునీల్ కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడుగా హెచ్‌డీ ఈరన్న, కోశాధికారిగా సీహెచ్ ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.రత్నప్రసాద్, మహిళా అధ్యక్షురాలిగా జె.సునీత (డ్వామా ఎన్టీఆర్ జిల్లా పీడీ), ఉపాధ్యక్షులుగా శివరాముడు, అమలాకుమారి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ప్రజలు-ప్రభుత్వానికి వారధులు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల కోర్కెలు తీర్చండి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ప్రభుత్వానికి- ప్రజలకు అత్యంత దగ్గరగా ఉంటూ... ప్రభుత్వ సేవలు అందించే గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తక్షణం పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజం పట్ల పూర్తి బాధ్యత, అంకితభావంతో గ్రామ వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారని, గడచిన ఐదేళ్లుగా ప్రభుత్వానికి-ప్రజలకు మధ్య వారధిగా వారు పనిచేస్తున్నారన్నారు. సచివాలయాల్లో 1.26 లక్షల మంది పనిచేస్తున్నారని, సచివాలయాల ద్వారా 19 విభాగాల సేవలు ప్రజలకు అందిస్తున్నారని, అయితే వారికి ఉద్యోగపరంగా, న్యాయపరంగా సౌకర్యాలు అందడం లేదన్నారు. ముఖ్యంగా ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ రావలసి ఉందని, ప్రస్తుతం రికార్డు అసిస్టెంట్ జూనియర్ స్థాయిలోనే ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఏదైనా మంచి జరిగిందంటే...అది గ్రామ వార్డు సచివాలయాల ఏర్పాటు మాత్రమేనని ముప్పాళ్ల అన్నారు. సచివాలయ ఉద్యోగులంతా దాదాపు ఉన్నత విద్యావంతులేనని, అంటువంటి వారికి కనీస సదుపాయాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా సచివాలయ ఉద్యోగుల సేవలు ఉపయోగించుకుంటామని హామీ ఇచ్చిందని, అందుకు అనుగుణంగా వారికి జాబ్ చార్ట్ ఇవ్వటం, పదోన్నతులు కల్పించటం చేయాలన్నారు. సెలవుల విషయంలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సచివాలయ ఉద్యోగులకు తాము అన్ని వేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర అధ్యక్షులు జి.జోసెఫ్ కిషోర్ మాట్లాడుతూ ఐదేళ్లుగా పనిచేస్తున్న తమకు న్యాయమైన సదుపాయాలు అందడం లేదన్నారు. ప్రధానంగా పదోన్నతులకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వానికి ఆలోచన లేదన్నారు. వ్యవస్థలో మార్పులు, చేర్పుల క్రమంలో ఉద్యోగ సంఘాల ప్రాతినిధ్యం లేకుండా కమిటీలు వేస్తున్నారని, ఇది ఆందోళనకరమన్నారు. ప్రతి ఉద్యోగికీ మేలు జరిగే వరకు డెమొక్రటిక్ అసోసియేషన్ తరపున పోరాడతామని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామ సచివాలయాల క్రమబద్దీకరణ, క్లస్టర్ విధానం వంటి ప్రతిపాదనలు ప్రచారంలోకి రావడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో ఏపీసీపీఎస్‌ఈఏ అధ్యక్షులు, జేఏసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాజీ పటాన్, డెమొక్రటిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి.రాజ్యలక్ష్మి, కోశాధికారి టి.దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిషోర్ అప్పికట్ల, చాంద్‌బాషా, బి.సతీశ్, ఎం.సత్యనారాయణ, డీఏ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్‌ను ఆదుకుందాం

హరినాథ్ రెడ్డి పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన ప్రకృతి విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మానవతా దృక్పథంతో వయనాడ్‌లోని బాధితులను ఆదుకోవాలని, విరివిగా విరాళాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రజలను కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని హరినాథ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. గతంలో ఎన్నడూ ఇంతటి విపత్తు సంభవించలేదని, వయనాడ్ ప్రజలను ఆదుకోవడానికి తమ వంతు సహకారాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ప్రధాని మోదీ వయనాడ్‌లో పర్యటించిన క్రమంలో అక్కడ జరిగిన విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని హరినాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ వయనాడ్‌లో ప్రాణ నష్టమే కాకుండా పంట నష్టం, పశు నష్టం కూడా భారీగా జరిగిందన్నారు. అక్కడ తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు ఎవరికి తోచిన సాయం వారు చేయాలని, అది వస్త్రాలు-వస్తు రూపేణ కూడా ఉండవచ్చు అని వారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కేతారి రాధాకృష్ణ, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు నవీన్ వినయ్ ఓం రాజ్ బాలకృష్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఫ్లూట్ సుబ్బు, ముకుంద దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష-కార్యదర్శులు నాగభూషణం, చిన్నం కాలయ్య, ఏఐటీయూసీ నాయకులు గోవింద స్వామి, అల్లాబక్షు, రాము పాల్గొన్నారు.

పిల్లలపై ఒత్తిడి వద్దు: జేవీఎస్ మూర్తి

విశాలాంధ్ర-గన్నవరం: పిల్లలపై చదువు ఒత్తిడి పెరుగుతోందని, దీనిని నివారించడం అవసరమని విశాఖ బ్యాంకు డైరెక్టర్ జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. నారాయణ, చైతన్య వంటి విద్యా సంస్థలు దోపిడీ యంత్రాలుగా మారాయని విమర్శించారు. విద్య విషయంలో పిల్లలు ఒత్తిడికి లోనుకాకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని సూచించారు. జేవీఎస్‌మూర్తి శనివారం గన్నవరంలోని విశాఖ బ్యాంకు ఖాతాదారుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ప్రతిభ కనబర్చిన ఆరుగురు విద్యార్థులకు రూ.35వేలు చొప్పున ఇచ్చారు. పురస్కారగ్రహీతల్లో చలసాని నిశాంత్ సాయి, ఎస్.పావని, కె.హర్ష వెంకట్, కొల్లి సాహితీ, కె.తేజస్వి, కె.వైష్ణవి ఉన్నారు. ఈ కార్యక్రమానికి బ్యాంకు డైరెక్టర్ పొట్లూరి వెంకట రమణారావు అధ్యక్షత వహించారు. జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది 2.36కోట్లను ప్రతిభావంతులకు అందజేస్తామని, మెరిట్ విద్యార్థులకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు నగదు పురస్కారమిస్తామన్నారు. 1.06 లక్షల మంది బ్యాంకు సభ్యుల పిల్లలకు ఈ విధంగా పురస్కారాలందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. విదేశీ రుణంగా రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఇస్తామని, ప్రతిభగల విద్యార్థులకు ఒకశాతం రాయితీ ఇస్తామన్నారు. వైద్యసాయం కూడా అందిస్తామని చెప్పారు. బ్యాంకు సేవలతో పాటు సామాజిక సేవలనూ విశాఖ బ్యాంకు అందిస్తోందని తెలిపారు. ఇలాంటి విశిష్ట సేవలను విశాఖ బ్యాంకు అందించడం శుభపరిణామని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకటరావు అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సీహెచ్ రామశాస్త్రి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెడుతున్న కేంద్రం

జె.లలితమ్మ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపద అయిన ప్రభుత్వ రంగంలోని రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, బొగ్గు గనులను దోచిపెడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె.లలితమ్మ విమర్శించారు. ఏఐటీయూసీ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జిల్లా అధ్యక్షులు కె.అజయ్ బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి లలితమ్మ మాట్లాడుతూ అనేక త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులు కాలరాస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పని చేస్తున్న లక్షలాది మహిళ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా, గౌరవ వేతనం పేరుతో వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేస్తామని మాట తప్పారని అన్నారు. సెప్టెంబరు 1,2,3 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాల్లో కార్మిక సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. మూడో తేదీన విశాఖపట్నంలో జరిగే మహా కార్మిక ప్రదర్శనకు కర్నూలు జిల్లాలోని ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షులు బి.రాజు, రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి ఒ.బి.నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి చర్యలు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు, గ్రామ స్వరాజ్యమే దేశ ప్రగతికి మార్గం' అన్న మహాత్మాగాంధీ మాటలే మార్గదర్శకంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. రాష్ట్రంలోని పంచాయతీలను, ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నుకునే సర్పంచుల వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. గ్రామాలకు జీవం పోసేలా పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయడం, గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు ముందడుగు వేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తాను అనేక పర్యాయాలు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా, అటవీశాఖ అధికారులతో సమీక్షలు చేసినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలాకాలంగా అపరిష్కృతంగా ఉండిపోతున్న సమస్యల వెనుకున్న కారణాలు అన్వేషించి...వీటి పరిష్కారానికి మూడు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ నిర్ణయాలు వెంటనే అమలు చేయాలని భావిస్తున్నామన్నారు. పంచాయతీలు, సర్పంచుల వ్యవస్థకు కొత్తజీవం పోయడానికి ఈ ముందడుగు ఉపయోగపడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కీలక నిర్ణయాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జల్ జీవన్ మిషన్ పథకంపై పల్స్ సర్వే పేరుతో ఓ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 15న జెండా వందనం పండగలా నిర్వహించేందుకు భారీగా నిధులు పెంచుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న సర్పంచుల ఆత్మగౌరవం తగ్గకుండా చూస్తామని అన్నారు.

రెజ్లర్ అమన్‌కు పవన్ అభినందనలు

పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ కాంస్య పతకాన్ని సాధించడం ఆనందాన్ని కలిగించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. అమన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. రెజ్లింగ్ విభాగంలో మన క్రీడాకారుల ప్రతిభ ప్రశంసనీయమని అన్నారు. వినేశ్ ఫొగాట్ దురదృష్టవశాత్తు ఫైనల్ పోటీకి దూరమయ్యారని చెప్పారు. అమన్ పతకం సాధించడంతో క్రీడాభిమానులు సంతోషంగా ఉన్నారని పవన్ తెలిపారు.

పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో పురపాలక సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, బదిలీలను తక్షణమే నిర్వహించాలని, పని సర్దుబాట్లలో భాగంగా వీరిని ఆయా పురపాలక పాఠశాలల్లో మాత్రమే సర్దుబాటు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. పురపాలక ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం స్థానిక ఎస్టీయూ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగింది. మల్లు మాట్లాడుతూ పురపాలక టీచర్ల సర్వీస్ వ్యవహారాలు విద్యాశాఖకు అప్పగిస్తూ జీవో 84 జారీ చేసిన తరువాత వీరికి సంబంధించిన ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీపీఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, 2009 నుంచి పెండింగ్ బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్బన్ ఎంఈఓలను నియమించి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల జీతభత్యాలను, సర్వీసు వ్యవహారాలను వారికి అప్పగించాలన్నారు. ఒక పురపాలక సంఘం నుంచి ఇతర పురపాలక సంఘాలకు, నగర పాలక సంస్థలకు బదిలీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఎస్టీయూ పురపాలక విభాగం కన్వీనర్లు బి.ఫణిభూషణ్, జి.వీరచంద్రయాదవ్, సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఎస్టీయూ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్, ఎస్.రామాంజనేయులు, పి.శ్రీనివాసరావు, కె.బాలాకుమారి, నారాయణ, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీకి అంతర్జాతీయ అవార్డు గర్వకారణం

వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి ప్రకృతి వ్యవసాయంలో అంతర్జాతీయ అవార్డు ఏపీ మహిళా రైతుకు రావడం గర్వకారణమని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. శనివారం పంచాయతీరాజ్ కమిషనర్ సమావేశ మందిరంలో రెండవ రోజు ప్రకృతి వ్యవసాయంపై కార్యశాల కొనసాగింది. ముగింపు కార్యక్రమంలో జులైలో పోర్చుగల్ దేశానికి చెందిన ప్రకృతి వ్యవసాయ అత్యుత్తమ అవార్డు గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యుమానిటీ 2024ను అందుకున్న సత్యసాయి జిల్లా బాతులపల్లి మండలం ఘంటాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు నాగేంద్రమ్మను ఘనంగా సన్మానించారు. తాను పొందిన ప్రకృతి సాగు నైపుణ్యాన్ని ఇతర రైతులతో పంచుకుని ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కృషి చేయాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డిల్లీ రావు సన్మాన గ్రహీతను కోరారు. ప్రభుత్వ సలహాదారు, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ సన్మాన గ్రహీతను అభినందించారు. రైతులకు మెరుగైన జీవనోపాధులు కల్పించడంతో పాటు వాతావరణంలో మార్పులు తీసుకురావడం, సమాజానికి పౌష్టికాహారాన్ని అందించడం, భూమి ఆరోగ్యం మెరుగుపరచడంలో ఆమె చేసిన కృషికి ఈ అవార్డు లభించిందని తెలిపారు. రైతు సాధికార సంస్థ సీఈవో బి.రామారావు, డిడి బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో విజయం తథ్యం

'స్థానిక' ఎమ్మెల్సీ అభ్యర్థిగా 12న నామినేషన్: బొత్స

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో విజయం సాధిస్తామని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం స్థానిక ఓ హోటల్లో సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వైసీపీ నేతలు, కార్పొరేటర్లు హాజరయ్యారు. బొత్స మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన ఎమ్మెల్సీ అభ్యర్థిగా అందరి సహకారంతో నామినేషన్ వేస్తానని చెప్పారు. కన్నబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసిన వైసీపీదే విజయమని ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు సంఖ్యా బలం ఉన్నా పోటీకి రావడం వెనుక ఉన్న అంతర్యం అర్థం కావడం లేదన్నారు. ఎవ్వరు ఎవరి కోసం గేట్లు తెరిచారో 2029 ఎన్నికల్లో చుసామన్నారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసిన వైసీపీకి విజయం ఖాయమన్నారు. పలువురు వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు బొత్సను అభినందించారు.

క్యాంప్ రాజకీయాలు ...

ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విజయం తేలిక కాదని వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు అర్థమైపోయింది. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీకి పూర్తి మెజారిటీ ఉన్నా పదికి పది స్థానాలను టీడీపీ కూటమి గెలుచుకోవడం మింగుడు పడడం లేదు. దీంతో వైసీపీ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లను కాపాడుకునే ప్రయత్నాల్లో పడ్డారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి: పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: 'ప్రతి ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలి.. ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలి' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా 3.0లో భాగంగా కలెక్టరేట్ వద్ద ఉన్న తపాలా కార్యాలయంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్లా మాధవితో కలసి ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈ నెల 15న ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేసే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని పెంపొందించే విధివిధానాలు చేపట్టాలన్నారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ (ఆంధ్రప్రదేశ్ సర్కిల్) కె.ప్రకాష్‌తో కలసి మొక్కలు నాటారు. అన్ని తపాలా కార్యాలయాల్లో జాతీయ జెండాలను అందుబాటులో ఉంచుతున్నామని ఆ శాఖ అధికారులు చెప్పారు. పోస్ట్ మాస్టర్ జనరల్ విజయవాడ రీజియన్ డీఎస్‌వీఆర్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ (ఆంధ్రప్రదేశ్ సర్కిల్) ఎం.జగదీశ్‌పాయి, గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లే కీలకం

గ్రామాభివృద్ధికి సర్పంచులే కీలకమని, గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం వారిని జీరో చేసిం పెమ్మసాని అన్నారు. తన కార్యాలయంలో శనివారం సర్పంచుల సంఘం రాష్ట్ర అసోసియేషన్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పక్కదారి పట్టిన న.రే.గా(నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీం) నిధుల వివరాలు, గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం, చెరువులు బాగు చేసుకోలేని తదితర సమస్యలను పెమ్మసాని దృష్టికి తీసుకువచ్చారు. అధికారం చేతిలో ఉన్నా అభివృద్ధి చేసుకోలేకపోయామంటూ పలువురు వాపోయారు. ఉపాధి హామీ నిధులను సమకూర్చాలని కోరారు. పెమ్మసాని మాట్లాడుతూ నరేగా నిధులను ఉపయోగించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. జలజీవన్ మిషన్, స్వచ్ఛభారత్, ఉపాధి హామీ కింద రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన నిధులను, మ్యాచింగ్ ఫండ్స్‌ను అందిపుచ్చుకునేలా తీవ్రంగా కృషి చేస్తున్నామని వివరించారు. గ్రీన్ అంబాసిడర్ల జీతాల భారం పంచాయతీలపైనే మోపిన జగన్ ప్రభుత్వం తీరును తప్పు పట్టారు. సీఎం చంద్రబాబు హయాంలో పంచాయతీలను అభివృద్ధి దిశగా నడిపిస్తామని తెలిపారు. ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రెసిడెంట్ వైవీబీ రాజేంద్రప్రసాద్, వివిధ జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.

బాబు, లోకేశ్‌పై విష ప్రచారం: టీడీపీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు జగన్... ఆయన వందమాగదులు తప్పుడు ప్రచారం మొదలు పెట్టారని, చంద్రబాబు, లోకేశ్‌లపై కావాలనే విషం చిమ్ముతున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్ విమర్శించారు. మంగళగిరి టీడీపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోనాయన మాట్లాడుతూ... చంద్రబాబు ఎప్పుడూ పేదల పక్షాన ఉంటానని చెబితే దాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేశారన్నారు. లోకేశ్ మాట్లాడిన దాంట్లో ముందు వెనుక తీసేసి దాన్ని దళితులపై తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. అంబేద్కర్ పేరు తీసేసి వైఎస్ఆర్ విదేశీ విద్యా కానుక అని పెట్టుకున్నారనీ, దాంతో ఎవరికి కోపం వచ్చిందో జగన్ పేరును తొలగించారని అన్నారు. అంబేద్కర్ విగ్రహానికి జగన్ దాత అని కొందరు సిగ్గులేకుండా అంటున్నారన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో అంబేద్కర్ విగ్రహం కట్టారని రాజేశ్ అన్నారు. చంద్రబాబు, లోకేశ్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేయకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు.

సంపాదకీయం

జనంతో సంబంధం లేని ప్రజా ప్రతినిధుల సభలు

మూడోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత పార్లమెంటు స్వరూపమే మారిపోయింది. అందులో జనం ఘోషే వినిపించడం మాయమై పోయింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మోదీ నాయకత్వంలోని బీజేపీతో ఢీకొన్నది నిజానికి సామాన్య ప్రజలే. ఈ ఎన్నికలలో అధికార పక్షం కుదుళ్లు కదిలి పోయాయి. దీనితో జనం సమస్యలు పార్లమెంటులో ప్రతిధ్వనిస్తాయన్న ఆశలు చిగురించాయి. మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చిన తరవాత రైతుల సమస్యలు రెండు సార్లు ప్రస్తావనకు వచ్చాయి. ఒక్కసారి ధరల పెరుగుదల ప్రసక్తి వచ్చింది. కానీ నిరుద్యోగ సమస్య, యువకుల నైరాశ్యం గురించి ఇసుమంత ప్రసక్తి కూడా రాలేదు. మహిళల దుస్థితి, ఈ దేశంలోని బ్యాంకుల డబ్బు కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్న మోదీ ప్రభుత్వ తీరుకూడా పార్లమెంటు చర్చల్లో ప్రతిధ్వనించనే లేదు. ప్రైవేటీకరణకు సంబంధించి ప్రభుత్వ ఆలోచనల గురించి వినిపించినా అవన్నీ అరణ్య ఘోషగా మారిపోయాయి. జనం సమస్యలు పార్లమెంటులో ప్రస్తావనకు రాకపోతే ఈ పార్లమెంటు ప్రయోజనం ఏమిటి అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. పార్లమెంటులో కొనసాగే రభస వెనకాల ఉన్న ఆంతర్యం ఎందుకో ఆలోచిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్, లోకసభ స్పీకర్ ప్రభుత్వం మీద చిన్నపాటి విమర్శలను కూడా సహించే స్థితిలోలేరు. అసలు సమస్యలను లేవనెత్తడానికి ప్రతిపక్షాలు ప్రయత్నించినప్పుడల్లా వారిని మాట్లాడనివ్వకుండా చేశారు. ఇద్దరు సభాపతులు అడ్డుకున్నది ప్రజా సమస్యల ప్రస్తావనను కాదు. ఆ సమస్యల నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలకు ఏ మాత్రం తావివ్వకుండా అడ్డు తగిలారు. ఈ ధోరణి మరో ముఖ్యమైన ప్రశ్న లేవనెత్తాల్సిన ఆవశ్యకతను గుర్తు చేసింది. సభాపతులు ఉన్నది ప్రభుత్వ పక్షాన నిలవడానికేనా అన్న ప్రశ్నా ఎదురైంది. సభాపతులు అధికార పక్షం కొమ్ము కాస్తూ ఉంటే ప్రతిపక్షాల మాట వినిపించే అవకాశం ఏది అన్న అంశమూ చర్చకు వచ్చింది. కానీ ఇటీవలి ఎన్నికలలో ప్రజలే కీలక పాత్ర పోషించారనుకున్నప్పుడు ప్రతిపక్షాలు ఏ వైఖరి అనుసరించాలన్నదీ ఆలోచించదగిన విషయమే. ఇంతకు ముందు ప్రతిపక్ష నాయకులు ప్రసంగాల ద్వారానే కాక ప్రశ్నల రూపంలో, లేఖల రూపంలో ఈ అంశాలను లేవనెత్తే వారు. కానీ ఇప్పుడు ప్రతిపక్ష నేత నేరుగా ప్రభుత్వాన్ని ఢీకొంటున్నారు. ఇతర ప్రతిపక్ష నాయకులు ఆయనకు తోడుగా గొంతెత్తున్నారు. జనం సమస్యలను, అణగారిన వర్గాల వాణిని రాహుల్‌తో సహా ఇతర ప్రతిపక్షాలు లేవనెత్తడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. జనం తమ సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రజలనే పార్లమెంటు ఆవరణలోకి తీసుకొచ్చే సంప్రదాయాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు. రైతులు, మురికి కాలవలను శుభ్రం చేసేవారు, శ్రామికులు, ఆకలిమీద పోరాటం చేస్తున్న సంఘాల వారిని పార్లమెంటు ఆవరణలోకి తీసుకు రావడానికి రాహుల్ ప్రయత్నం చేశారు. తలమీద పెట్టుకుని మల మూత్రాలను తీసుకెళ్లేవారు ఎవరూ లేరని ప్రభుత్వం వాదిస్తూనే ఉంటుంది. కానీ ఆ పద్ధతి ఇప్పటికీ సాక్షాత్కరిస్తూనే ఉంది. ఇప్పటిదాకా పార్లమెంటు సభ్యులు, మంత్రులు పార్లమెంటులో ఉండే అయిదు నక్షత్రాల సౌలభ్యాలను అనుభవించడానికి మాత్రమే అలవాటు పడ్డారు. అణగారిన వర్గాల సమస్యల మీద ప్రతిపక్షాలు, వివిధ వర్గాల వారు ఏర్పాటు చేసుకున్న సంఘాలు ఎన్ని ఉన్నా వారి వాణి పార్లమెంటులో పీలగానైనా వినిపించిన ఉదంతాలు చాలా స్వల్పం. కానీ ఈ సమస్యలను పార్లమెంటులో లేవనెత్తడమే కాకుండా ఆ వర్గాల వారు పార్లమెంటు ఆవరణలోకి ప్రవేశించి తమ గోడు వెళ్లబోసుకునే అవకాశం ప్రతిపక్షాలు కల్పించడంతో ప్రభుత్వపక్షం కంపించి పోయింది. సభాపతులు భయకంపితులైపోయి ప్రభుత్వ సమర్థనే తమ కర్తవ్యం అన్న రీతిలో వ్యవహరించడం మొదలు పెట్టారు. సభాపతులు ఈ విధానాన్ని ఆమోదించడానికి ఏ మాత్రం సిద్ధంగా లేరు. పార్లమెంటులో నిరుద్యోగ సమస్యను లేవనెత్తడానికి సభాపతులు అనుమతించనే లేదు. ఈ ప్రశ్నలకు ప్రభుత్వ పక్షం సమాధానాలూ చెప్పలేదు. ధరల పెరుగుదల సభలో రెండుసార్లు ప్రస్తావనకు వచ్చినా ప్రభుత్వం సమాధానం ఇవ్వనే లేదు. సభలో రైతుల సమస్య, మద్దతు ధరకు చట్ట ప్రతిపత్తి కల్పించే అంశం ప్రస్తావనకు వచ్చినా ఈ సమస్యలన్నీ పరిష్కరించేశాం అని దబాయించి అధికార పక్షం సంతృప్తి పడింది. వరసగా జరుగుతున్న రైలు ప్రమాదాల, రోడ్డు ప్రమాదాల వ్యవహారం కూడా సభలో ప్రస్తావించడానికి అవకాశమే ఇవ్వలేదు.

భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.) గిడ్డంగుల్లో తగ్గుతున్న ఆహార ధాన్యాల నిలవలు, పంటల బీమా ప్రయోజనం అందని వ్యవసాయ రంగంలోని వారి దుస్థితినీ సభలో ప్రస్తావించనివ్వలేదు. జనం సమస్యలను ప్రస్తావించనివ్వని స్థితిలోనే ఆ సమస్యలను ప్రస్తావించడానికి రాహుల్‌తో సహా ప్రతిపక్ష నాయకులు విశ్వప్రయత్నం చేశారు. ఆ సమస్యలు సభ దృష్టిలో మాయమై పోకుండా కాపాడారు. అనేక సమస్యలను సభలో ప్రస్తావించడానికి అవకాశం ఇవ్వకపోయినా రైతులు, మురుగు కాలవలు శుభ్రం చేసేవారు, మల మూత్రాలను ఎత్తి పోసేవారు సాక్షాత్తు పార్లమెంటు ఆవరణలో తమ గోడు వెళ్లబోసుకునే అవకాశం మన పార్లమెంటు చరిత్రలో మొదటిసారి దర్శనం ఇచ్చింది. మురికి కాలవలను యంత్రాల ద్వారా మాత్రమే శుభ్రం చేస్తున్నట్టు ప్రభుత్వం ఎంత టముకు వాయించుకుని చెప్పుకుంటున్నా వారి ప్రతినిధులతో రాహుల్ గాంధీ పార్లమెంటు ఆవరణలోనే ముచ్చటించారు. పార్లమెంటులో జరుగుతున్న వాద వివాదాలు, దూషణ భూషణలతోపాటు ఇలాంటి చిత్రాలు కూడా జనం దృష్టికి వచ్చాయి. ఈ సమస్యలను పార్లమెంటులో లేవనెత్తుతామని రాహుల్ గాంధీ వారికి భరోసా ఇచ్చారు. వివిధ వర్గాలవారు పార్లమెంటు ఆవరణలోకి ప్రవేశించి తమ గోడు వెళ్లబోసుకోవడానికి అడ్డంకులు కల్పిస్తున్నారు. ఇదంతా సభాపతుల సమ్మతితోనే జరుగుతోందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ సంకెళ్లను రాహుల్ గాంధీ ఛేదించగలిగారు. తనతో మాట్లాడడానికి వచ్చిన ప్రతినిధులను పార్లమెంటు ఆవరణలోకి రానివ్వని సందర్భాలలో రాహుల్ గాంధీ తానే వెళ్లి వారితో ముచ్చటించారు. అనువైనప్పుడు వారిని ప్రతిపక్ష నాయకుడిగా తనకు కేటాయించిన గదిలో మాట్లాడారు. అయితే జాలర్లు, ఆకలిమీద పోరాటం చేస్తున్న వారికి ఈ అవకాశమూ దక్కనివ్వలేదు. సభాపతుల వ్యవహారసరళి విచిత్రంగా తయారవుతోంది. బీజేపీ సభ్యుడు ఘనశ్యాం త్రివేదీ పెద్దంతరం చిన్నంతరం చూడకుండా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖడ్గేను అవమానించే రీతిలో మాట్లాడారు. సహజంగానే ఖడ్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యసభ అధ్యక్షులు ధన్‌కర్ ఆ సభ్యుడిని మందలించడానికి బదులు ఇద్దరినీ తన చేంబర్‌లోకి తీసుకెళ్లి తుని తగువు చేయడానికి ప్రయత్నించారు. ఇదే మాట సభలో చెప్పండని ఖడ్గే కోరారు. ధన్‌కర్ నిరాకరించారు. లోకసభ స్పీకర్ వ్యవహారం దీనికి భిన్నంగా ఏమీలేదు. ఆయన ప్రతిపక్షాలవారు నోరు విప్పగానే "నో నో నో" అంటూ ఉంటారు. లేదా మీరు మాట్లాడేది రికార్డులకు ఎక్కడం లేదు అని తెగేసి చెప్తారు. రికార్డుల నుంచి తొలగించడంలో ఓం బిర్లా, ధన్‌కర్ ప్రత్యేక నైపుణ్యం సాధించేశారు. జనం నీడైనా పార్లమెంటు మీద పడనీయకుండా సభాపతులు సకల కట్టుదిట్టాలూ చేస్తున్నారు. కొయ్య కాళ్ల ఆధారంగా ప్రభుత్వం నడుపుతున్న మోదీ వైఖరి మారలేదనడానికి ఇదంతా

పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కాపాడుకోవాలి

ఈ ఏడాది మే 26వ తేదీన రాజోలులో నివాసముంటున్న పార్టీ కామ్రేడ్ ప్రముఖ డాక్టర్ సత్యనారాయణ, ఝాన్సీ ఇంటిలో అప్పటికే రెండు వారాలుగా ఉంటున్న దాదాపు 60 ఏళ్లపాటు మఖ్దుంభవన్ కార్యదర్శిగా పనిచేసిన ధూళిపాల సీతారామచంద్రరావు (డీఎస్ రామచంద్రరావు)ని చూసేందుకు వెళ్లేసమయానికి ఎర్రటి రంగు ఫుల్ హాండ్స్ చొక్కా, తెల్ల పంచె కట్టుకుని అత్యంత ఉత్తేజభరితంగా, ఉత్సాహంగా కబుర్లు చెప్తుతున్నారు. రామచంద్రరావుని చూడగానే ఒకలాంటి ఉత్తేజం, ఉత్సాహం కలిగాయి. చెరగని నిబద్ధత, అంకితభావానికి మారుపేరు ఆయన. అప్పటికే అక్కడ ఉన్న డా.రమేష్, లెక్చరర్ మనోరమ, డి.వి.వి.ఎస్.వర్మతో ఉత్సాహంగా సంభాషిస్తు న్నారు. ఆ సమయంలో నేను అడిగిన కొన్ని ప్రశ్నలకు తడుముకోకుండా, స్పష్టతతో ఆయన చెప్పిన సమాధానాలు.

ప్రశ్న: గతంలో కమ్యూనిస్టుపార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఇప్పటి తరంలో లేకపోవడానికి ప్రధాన కారణం?

జవాబు: కమ్యూనిస్టుపార్టీకి ఆదరణ లేదనేమాట పూర్తి అవాస్తవం. స్వప్రయోజనాలకోసం కమ్యూనిస్టుపార్టీ అభిమానులు, కార్యకర్తలు పార్టీలు మారినా వారి భావజాలం మాత్రం ఎప్పటికీ మారదు. నిరాశావాదాన్ని దరిచేరనివ్వకూడదు. సోషలిస్టు భావజాలం సమసిపోతోందనే నిరుత్సాహ పూరిత ఆలోచనలు రాకూడదు. సామ్యవాద భావజాలం, సోషలిస్టు సిద్ధాంతాలు ఉన్న కమ్యూనిస్టు విప్లవకారులు ఎప్పుడూ మంచి సాహిత్యం చదవాలి. తెలుగులో చాలా ప్రముఖ రచయితలు ఉన్నారు. కందుకూరి, గురజాడ, శరత్, కొడవటి గంటి, బాపిరాజు తదితరుల రచనలు చదవాలి, స్ఫూర్తి పొందాలి. నాయకత్వం కూడా ఆ దిశగా సాగితే కార్యకర్తలు స్ఫూర్తి పొందుతారు. ఈ విధానం కొరవడిందనేది నా అభిప్రాయం. శ్రీశ్రీ అంటాడు నన్ను ఉదాహరణగా తీసుకోకండి. నా సాహిత్యం, రచనలు ద్వారా మీరు స్ఫూర్తి పొందాలి. స్ఫూర్తిదాయకమైన రచనల ద్వారా ప్రజల్లో సాహిత్యం పట్ల మక్కువను పెంచగలగాలి. తద్వారా విప్లవాత్మక భావజాలాన్ని పదునుపెడు తూనే ఉండవచ్చు. చదివితేనే కదా...భావజాలం వెలుగులోకి వచ్చేది..నాలుగు మాటలు మాట్లాడగలగుతాం...విమర్శనాత్మక దృష్టితో ఆలోచించడం నేర్చుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నాయకుల్లోనే పఠనాశక్తి తగ్గింది. వారు చదివితేనే కార్యకర్తలకు చెప్పగలరు. సమాజంలో వేళ్లూనుకున్న ఛాందసవాదాన్ని నిర్మూలించే ఆలోచన పఠనాశక్తి ద్వారా వస్తుంది.

ప్ర: ఈ వయస్సులో కూడా ఇంక ఉత్తేజపూరితంగా ఉన్నారు. మీమాటల్లో మీ సాహిత్యం గురించి, కమ్యూనిస్టు లక్షణాలు ఎలా వచ్చాయి?

జ: పెద్దలతో పనిచేయడం, వారిలోని సానుకూల దృక్పథం నాలో స్ఫూర్తికి ప్రధాన కారణం. ముఖ్యంగా చంద్ర రాజేశ్వరరావు , నీలం రాజశేఖరరెడ్డికి అత్యంత సమీపంగా మెలగటం. వారి దగ్గరున్న వాళ్లు ఎవరైనా జీవితంలో రాణించక తప్పదు. కఠోర దీక్ష, సోషలిస్టు రాజ్యస్థాపనకు కృషిచేసిన మహానాయకులు వారు. ఒకసారి సీఆర్‌గారు నీ పని ముగించి నా ప్రశ్నకు సమాధానం చెప్పు అన్నారు. 30ఏళ్లనుంచి చూస్తున్నాను. నీలోని నిష్కలంక వ్యక్తిత్వానికి ప్రధానకారణం ఏంటి అడిగారు.? కోనసీమ ప్రభావమా అని అడగ్గా ....నేను ఉంటున్న కమ్యూనిస్టుపార్టీ వాతావరణం, కమ్యూనిస్టు భావజాలం, మీలాంటి సహచరుల సాంగత్యం అని చెప్పగా గట్టిగా నవ్వారు. కోనసీమ ప్రభావం కూడా చాలా ఉంది. కోనసీమ వాసులు ఆలోచనాపరులు... సాహిత్యప్రియులు. ఎందుకు మీరు నన్ను ఈ ప్రశ్న అడిగారు అని అడగ్గా ...నువ్వు ఎప్పుడూ దేనికీ ఆందోళనపడవు...పని పిపాసివి అని అన్నారు.

ప్ర: చంద్ర రాజేశ్వరరావు, నీలం రాజశేఖరరెడ్డి గారిలో మీకు నచ్చిన అంశం?

సీఆర్ రాష్ట్రం, దేశమంతా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం అవిరళ కృషి చేశారు. పార్టీని పటిష్టపరిచారు. సోషలిస్టు సమాజస్థాపనకు కలలు కన్నారు. ఎంత తిరిగినా పుట్టిన ఊరుపై మమకారం అమితంగా ఉండేది. సీఆర్ పార్టీ భావజాల వ్యాప్తికి కష్టపడ్డారు. కార్యకర్తలకు ఆయన ఒక ఉత్తేజం. సృజనాత్మకమైన మేధస్సు ఆయనది. కామ్రేడ్స్ వద్ద నుంచి రూపాయి రూపాయి వసూలుచేసి ఢిల్లీ దగ్గర ఫరీదాబాద్‌లో స్థలంకొని, పార్టీ స్కూలు పెట్టి, కార్యకర్తలో పార్టీ భావజాలవ్యాప్తికి కృషి చేశారు రాజశేఖరరెడ్డిగారు. పార్టీ సిద్ధాంత వ్యాప్తికి స్కూల్స్ నిర్వహణకు అనేక మంది ఉపాధ్యాయులకు రాజశేఖరరెడ్డి తర్ఫీదు ఇచ్చేవారు. ముఖ్యంగా యువకులకు ఆరోజుల్లో మంచి ఆదర్శంగా ఉండేవారు. మార్క్సిస్టు భావజాలంతో యువతను సిద్ధాంత వేత్తలుగా, నాయకులుగా తయారు చేసేందుకు కృషిచేశారు. విదేశాల్లోని విద్యార్థులకు పార్టీ ఎడ్యుకేషన్ క్లాసులను అప్పటి సోషలిస్టు దేశాల్లో నిర్వహించేవారు. పార్టీలో పేదవర్గాల వృద్ధికోసం కృషిచేసేవారు. ఒకో సారి ఒకో దేశంలో సోషలిజంపై క్లాసులు నిర్వహించేవారు. ఆ విధంగా పార్టీ పంపిన వారిలో డాక్టర్ సత్యనారాయణ ఒకరు. ఆయన ఇప్పటికీ రాజోలులో ఆదర్శంగా వైద్యం చేయడానికి ప్రధాన కారణం పార్టీ నాయకులే.

సీఆర్‌కు ఎంత కోపం వచ్చినా బైటపడేవారుకాదు. ఒకసారి సీఆర్, ఎన్ఆర్ నిశ్శబ్దంగా ఉన్న సమయంలో కాఫీ తీసుకు వెళ్లాను. ఆ సమయంలో వారి మధ్య జరుగుతున్నది నిర్మాణంలో, పార్టీ సాహిత్యంలో ఉన్న భేదాభిప్రాయాలపై తీవ్ర వాదోపవాదాలతో కూడిన చర్చ . పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి బైట ప్రపంచానికి తెలియకుండా ఎన్ని విభేదాలున్నా వారిలో వారు చర్చించుకునేవారు.

ప్ర: మీపై తెలంగాణ సాయుధపోరాటంతోపాటు ఎన్నోఉద్యమాల ప్రభావం ఉందికదా..

జ: అవును నేను చాలా ఉద్యమాలు చూశాను. ముఖ్యంగా ఆ రోజుల్లో కమ్యూనిస్టుపార్టీ కృషితోనే సాయుధ పోరాటంలో విజయం సాధించాం. అది పార్టీ నాయకత్వ విజయం. ప్రస్తుత పార్టీలో నాయకత్వ లోపం ప్రధానమైనదిగా ఉంది. కార్యకర్తలదికాదు. వారికి సరైన మార్గనిర్దేశకత్వం లేకపోవడం కమ్యూనిస్టుపార్టీకి ప్రధాన లోపంగా ఉంది.

ప్ర: పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మీరిచ్చే సందేశం

జ: రానురాను పార్టీ నాయకత్వంలో దృఢసంకల్పం తగ్గుతోంది. కింది స్థాయిలో పార్టీని పునర్నిర్మించుకోలేకపోతున్నారు. కార్యకర్తలను కూడగట్టడంలో విఫలమవుతున్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను తయారుచేయడం పార్టీ నిర్మాణానికి నాయకులు మూల స్తంభంగా ఉండాలి. నాయకుల పార్టీగా కాకుండా కార్యకర్తల పార్టీగా కమ్యూనిస్టుపార్టీ తిరిగి ఎదగాలి. తద్వారా పూర్వ వైభవాన్ని తీసుకురాగలగాలి.

– ఈడ్పుగంటి రోమిల

అణగారిన వర్గాల జీవన ప్రమాణాల పెంపు అవశ్యం

డి. రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

కులం, దానిని ఏమి చేయాలనేది ఎప్పటికీ అంతుచిక్కని ప్రశ్న. సుప్రీంకోర్టు ఇటీవలి తీర్పు ఈ ప్రశ్నకు మరోసారి తెరతీసింది. తీర్పు ఎక్కువ భాగం కులం, సమాజంలో దాని ప్రభావంపై వరకు మాత్రమే పరిమితమైంది. ప్రాచీన కాలం నుంచి ఆచరిస్తున్న కులం ధోరణిలో మంచి మార్పు వస్తుందన్న ఆశాభావం నెలకొని ఉంది. రాజకీయ ప్రయోజనం కోసం కులాన్ని గాఢంగా వినియోగించుకునేందుకు గణనీయమైన పోరాటమే జరిగింది. నిర్దిష్టమైన భౌతిక అంశాలు, దాని పర్యావసానాల ఆధారంగా పోరాటం జరిగింది. కులం నిరంతరం రాజకీయాలు, ఆర్థిక రంగం, సమాజంపై ప్రభావం చూపుతోంది. సుప్రీంకోర్టు తీర్పు మూలంగా రిజర్వేషన్ విధానం వల్ల అణగారిన కులాలకు ప్రయోజనం కలిగిస్తుంది. ఈ తీర్పు, దాని ఉద్దేశం ప్రశంసించ దగింది. అయితే ఇందులో చాలా పరిశీలించవలసిన అంశాలున్నాయి. ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టం కావడానికి ఆటంకం కలిగించే అవకాశం ఉండవచ్చు. రాజకీయంగా ప్రజలందరికీ సమానత్వం ఇవ్వాలని రాజ్యాంగ ప్రజాస్వామ్యం హామీ ఇచ్చింది. అయితే, దీర్ఘకాలంగా రాజకీయ సమానత్వం సాంఘికంగా, ఆర్థికంగా అమలు జరగడంలేదు. చరిత్రాత్మకంగా అణగారిన కులాలు ఎస్సీలు, ఎస్టీలను నోరు మూయించడం కనిపించకుండా ఈ పై విషయాలలో అమలు చేస్తున్నారు. ఈ అవగాహ నను దృష్టిలో ఉంచుకుని సుప్రీంకోర్టు తన తీర్పులో ఎస్సీ, ఎస్టీలలో ఉప కులాల వర్గీకరణను అమలు చేయాలని పేర్కొన్నది. ఇది తప్పనిసరైన చర్య. ఈ తీర్పు ప్రభావాన్ని అర్థం చేసుకునేందుకు రాజ్యాంగ దృక్కోణాన్ని అది హామీ ఇచ్చిన స్వేచ్ఛ, సమానత్వం అంశాలపై దాని ప్రభావాన్ని ముందుగా తెలుసుకోవాలి.

కులం, మతంలతో సంబంధం లేకుండా అందరికీ సమానత్వాన్ని రాజ్యాంగం పద్నాలుగవ ఆర్టికల్‌లో హామీ ఇచ్చింది. అదే సమయంలో రాజ్యాంగంలో పేర్కొన్న వాస్తవ అంశంలో అధికారిక మార్పులు మాత్రమే చాలవు. వాస్తవంగా సమానత్వాన్ని అమలు చేయడం ముందు ముందు వీటిని కొనసాగించడం ధృఢమైన కార్యాచరణ విధానం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు కల్పించాలి. అదే సమయంలో అంటరానితనాన్ని ఆచరించడాన్ని నేరంగా పరిగణించాలి. ఆర్థిక సమానత్వాన్ని సాధించడానికి ప్రభుత్వ విధానంలో ఆదేశిక సూత్రాలు ఇలా పేర్కొన్నాయి. “ఆదాయంలో కనీస అసమానతల స్థాయిని తగ్గించటానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలి.” ఈ అంశాలన్నీ సమర్థమైన గుర్తింపు, ప్రాతినిధ్యం పునః పంపిణీ చేయడానికే ఉద్దేశించినవి. భారతదేశ సమాజాన్ని డా॥అంబేద్కర్ చక్కగా విశ్లేషించారు. అనేక కులాలు, మతాల బహుళ సమాజం మనది. అయితే ఈ కులాలు, మతాలు పైనుంచి కిందకు అమలులో ఉన్నాయి. బ్రాహ్మణ వర్గానికి సమాజం ఉన్నత స్థాయిని కల్పించింది. దేశంలో దళితులు, ఆదివాసీలపైన తీవ్రమైన వేధింపులు, వారిపై హింసాయుత చర్యలు జరుగుతూ వచ్చాయి. ఈ వర్గం మనుస్మృతిని దేశంలో అమలు చేయాలని సుదీర్ఘ కాలంగా అసమానతలను కొనసాగిస్తున్నది.

ఎస్సీ, ఎస్టీల పీఓఏ చట్టంలో పేర్కొన్న అంశాల ప్రకారం తప్పు చేసిన వారిని శిక్షించటం తక్కువగా జరుగుతుంది. ఉద్యోగ, విద్యారంగాలలో అన్ని స్థాయిలలో రిజర్వేషన్‌ల అమలును నిరంతరాయంగా బ్రాహ్మణ వర్గ ఆధిక్యత అడ్డుకుంటున్నది. దేశంలో నయా ఉదారవాదం అమలు జరగడం ప్రారంభించిన నాటి నుంచి ఉద్యోగాలు, ఇతర అంశాలలో సమానత్వ అవకాశం క్షీణిస్తోంది. ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల కోసం ప్రజలు అభిలషిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఉద్యోగాల సృష్టి తీవ్ర ఉదాసీనంగా ఉన్నది. ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుకుంటున్న వారి కోసం సీట్లను పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగాల కోసం ఒత్తిడి పెరిగింది. రిజర్వేషన్ కేటగిరీలలో తమను చేర్చవలసిందిగా అనేక ఉప కులాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. రిజర్వేషన్ కేటగిరీలలో తమకు ప్రత్యేక కోటాలను కేటాయించాలని రిజర్వేషన్ ప్రయోజనాలు తమకు దక్కడం లేదని అణగారిన వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, విద్య, ఇతర సంస్థలను విచ్చలవిడిగా ప్రైవేటీకరించటం మరింత సంక్లిష్టతకు దారితీసింది. ఎక్కువ ఉద్యోగ అవకాశాలను, విద్యావకాశాలను కల్పించి దీర్ఘకాల పరిష్కారాలను కనుగొనాలని ప్రస్తుత పరిస్థితి కోరుతున్నది. ప్రైవేటురంగంలోను రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టి అణగారిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్ విధానాన్ని అమలుచేయాలి. సుప్రీంకోర్టు తన తీర్పులో రిజర్వేషన్‌లు పొందుతున్న కులాలలో ఉప కులాలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నది. అయితే సుప్రీంకోర్టే విధించిన 50 శాతం రిజర్వేషన్‌ల పరిధి విషయంలో మౌనంగా ఉన్నది. వివిధ కులాలలో ఉన్నటువంటి ఉప కులాల మధ్య అసమానతలను గుర్తించి సుప్రీంకోర్టు వీటి పరిధిని తిరిగి పరిశీలించవలసింది. అనేక మంది పేర్కొన్నట్టుగా రిజర్వేషన్లలో పరిమితి 50 శాతం ఉండాలని ప్రైవేటురంగంలో ఇప్పుడు రిజర్వేషన్లు లేని విషయాన్ని పరిశీలించలేదని అణగారిన వర్గాలను సామాజిక న్యాయం పరిధి నుంచి మినహాయించారన్న అంశాలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు క్రీమీలేయర్ పైన ఉన్న గందరగోళాన్ని, ఆందోళనను నలుగురు న్యాయమూర్తులు తమ తీర్పులో పరిశీలించి స్పష్టం చేయవలసింది. స్పష్టం చేయకపోవటం మూలంగా రిజర్వేషన్‌లకే స్వస్తి పలకటానికి అవకాశం ఉందన్న భీతి కలుగుతోంది. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు కల్పించడంలో చిరకాలంగా వివక్షను చూపిస్తూ వారిని మినహాయించారు. ఆదాయం పరంగా పరిశీలించి రిజర్వేషన్‌లు కల్పించకపోవటం వల్ల దళితుల పట్ల వివక్ష కొనసాగుతోంది. ఇందుకు సానుకూలమైన కార్యాచరణ విధానాన్ని పరిశీలించకుండా న్యాయ వ్యవస్థ ద్వంద్వ ప్రమాణాలు అనుసరించిందన్న ఆరోపణ ఉన్నాయి. రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూలు ఇస్తున్న రక్షణను అనుసరించి తమిళనాడు రాష్ట్రం 69 శాతం రిజర్వేషన్‌లను కల్పిస్తున్నది. అయితే బీహార్‌లో ఇదే విధమైన రిజర్వేషన్‌లు కల్పించటానికి వీలులేదని సుప్రీంకోర్టు కొట్టివేసింది. సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్‌ల పరిధిని ఉల్లంఘించి పది శాతం ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను చట్టబద్ధం చేశారు. అయినప్పటికీ వాటిని పరిశీలించలేదు. ఈ సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి. అణగారిన వర్గాల ప్రజలకు రిజర్వేషన్‌లు కల్పించకపోవటంపై శాస్త్రీయ పరిశీలన ద్వారా ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వాలే పరిష్కరించాలి. అయితే ప్రస్తుత సామాజిక గ్రూపుల సమాచారం ఏమాత్రం సరిపోయేదికాదు. శాస్త్రీయ దృక్పథంతో కుల ఆధారిత గణాంకాలను తప్పనిసరిగా పరిశీలించేందుకు విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. అయితే స్వార్థ ప్రయోజనాల కోసం అనేక గ్రూపులు కులం, కుల ఆధారిత ఆచరణలోను అలాగే ఉంచాలని ప్రయత్నిస్తున్నారు. కుల నిర్మూలన జరగాలని ఎవరోకాదు డా॥అంబేద్కర్ ప్రకటించిన సామాజిక లక్ష్యాన్ని సాధించాలి. కుల వివక్ష, కుల దోపిడీ అణచివేతలకు సమాజంలో చోటులేకుండా చేయాలి. అణగారిన వర్గాల ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. సమానత్వ సాధన మార్గంలో కుల వివక్ష పెద్ద ఆటంకంగా ఉంది. ఇప్పుడున్న విధానాలను తిరిగి విశ్లేషించేందుకు కోర్టు తీర్పు మంచి అవకాశం కలిగించింది. ఈ లక్ష్యాలను, గణాంకాలను, రిజర్వేషన్ విధానాన్ని విస్తరించటం ఎంతైనా అవసరం. తప్పుడు విధానాలతో హక్కులను, ఉపాధులను తిరస్కరించటం అన్యాయం. ప్రతిచోట న్యాయానికి అన్యాయం ముప్పుగానే ఉంటుందని డా॥మార్టిన్‌లూథర్‌కింగ్ జూనియర్ అన్నారు. న్యాయం, సామాజిక, ఆర్థిక, రాజకీయంగాలేని సమాజంలో అన్ని అవకాశాలు రద్దవుతాయి. కులరహిత, వర్గరహిత సమాజాన్ని సాధించటానికి సామాజిక న్యాయం మనందరం ఐక్యం కావాలని దేశ వ్యాప్తంగా చర్చ జరగాలి. ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం కూడా పోరాడుతున్న మనం కులం సమస్యను పట్టించుకోకుండా ఉండకూడదని సీపీఐ కార్యక్రమం స్పష్టంగా పేర్కొంది. కులాల పట్ల నిరంతర సైద్ధాంతిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక, ఆచరణాత్మక పోరాటాన్ని కొనసాగించవలసిన అవసరం ఉంది.

మూఢ నమ్మకాల్ని పాటించే వారిని బహిష్కరించండి!

డాక్టర్ దేవరాజు మహారాజు

దేవుడు ఉంటే పలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న రక్తపాతాన్ని, నరమేధాన్ని ఆపలేదు ఎందుకూ? తమ కుమారులు కొట్టుకుని చావడం దేవుడికి ఇష్టమా? యుద్ధం జరగడంలో గానీ, శాంతి స్థాపనలో గానీ దేవుడి ప్రమేయం ఉండదని తెలుసుకోవాలి. దేవుడు లేడన్న సత్యాన్ని ప్రజలు తెలుసుకోలేనంత కాలం, తమ సమస్యలు తామే పరిష్కరించుకోవాలని తెలుసుకోలేనంత కాలం, 'మనుషుల్లో స్థాయి భేదాలు లేవు, అందరిదీ ఒకే జాతి'- అని గ్రహించనంత కాలం- ప్రపంచంలో ఈ నరమేధం జరుగుతూనే ఉంటుంది. అందువల్ల మూఢనమ్మకాలను పాటించేవారిని, ప్రచారం చేసేవారిని ఆయా మతాల సంబంధీకులు నిర్దాక్షిణ్యంగా తమ తమ మతాల నుంచి బహిష్కరించాలి. అప్పుడు గానీ మతాల మీద ప్రజలకు నమ్మకం కలగదు. అప్పుడే అవి నిజమైన మతాలు అవుతాయి. లేదా చిల్లర మతాలుగా మిగిలిపోతాయి. ఈ పని చేయాల్సింది మన భారతదేశ రాజ్యాంగా స్ఫూర్తిని నిలుపుకోవడానికే! మరి మతాలే అంధ విశ్వాసాల్ని వ్యాప్తి చేస్తుంటే ఏం చేయాలీ? తప్పదు- మతాల్నే త్యజించాలి! ఇంతకీ మతాలెందుకు ఏర్పడ్డాయి? అవి ఎవరి కోసం పని చేస్తున్నాయో వాటి అంతరార్థం ఏమిటో చూడడండి. పురుషుడు పురుషుడి కోసం ఏర్పాటు చేసుకున్నదే మతం. వేర్వేరు మతాల్లో స్త్రీ, పురుషులకు ఉన్న విలువ ఏ పాటిదో చూడండి. క్రైస్తవం ప్రకారం పురుషుడికి ఉన్న విలువలో స్త్రీ విలువ అరవై శాతమే- అని లివిటికస్ 27-3-7 చెపుతోంది. ఇస్లాం ప్రకారం (4-24) అంతకు ముందే వివాహమైన స్త్రీలను పురుషులు పెళ్లి చేసుకోరాదు. బానిసలైతేనో లేక యుద్ధంలో గెలుచుకున్న వారైతేనో చేసుకోవచ్చు. హిందూమతం ప్రకారం (తిన్ష- 9/93) పురుషులు 24-30 ఏళ్ల వయసులో 8-12 ఏళ్లున్న బాలికల్ని పెండ్లి చేసుకోవాలని మనుస్మృతి చెపుతోంది. జుడాయిజం (తల్మడ్) స్త్రీ- అనుభవిస్తూ ఆనందించవల్సిన ఒక తిత్తి (వస్తువు). జైన మతంలోని దిగంబర శాఖ ప్రకారం స్త్రీలు తమ తదుపరి జన్మలో పురుషుడిగా పుడితేగాని, నిర్వాణస్థాయికి చేరుకోరు! మార్పులు చెందుతూ వచ్చిన ఒక బుద్ధ శాఖ ప్రకారం- పురుష భిక్కుల కన్నా, స్త్రీ సన్యాసులకు నిబంధనలు ఎక్కువ! జీవితంలో విఫలమైన పురుషులు- తర్వాతి జన్మలో స్త్రీలుగా పుడతారు. తమకు పనికొచ్చేది ఏది ఉన్నా వెంటనే దాన్ని తమ మతంలో విలీనం చేసుకోవడం బ్రాహ్మణిజానికి అలవాటు. ఇది శతాబ్దాలుగా జరుగుతూ ఉన్న విషయమే. బుద్ధుడి విగ్రహాలు మార్చి, హిందూ దేవతా విగ్రహాలుగా మార్చుకోవడం లోగడ చూశాం. ఇప్పుడు మరిన్ని కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంబేద్కర్ రెండో భార్య సవిత బ్రాహ్మణ మహిళ కావడం వల్ల, అంబేద్కర్ బ్రాహ్మణుల ఇంటి అల్లుడు అని, ఆయనను మేము తగురీతిలో గౌరవించుకుంటూనే ఉంటామని తిరుపతి బ్రాహ్మణ సంఘం నాయకులు రాఘవన్ అజయ్‌కుమార్- ప్రమీలమ్మల ఆధ్వర్యంలో తిరుపతి పట్టణంలో తొలిసారి అంబేద్కర్ 127 వ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. స్వార్థపరులైన కొందరు రాజకీయ నాయకులు అంబేద్కర్‌కు, బ్రాహ్మణ సంఘాలకు మధ్య వివాదాలే సృష్టిస్తున్నారని అన్నారు. అంబేద్కర్ పై చదువుల కోసం ఆనాడు ఓ బ్రాహ్మణుడు తన ఇంటిని అమ్మి ఆయనను విదేశాలకు పంపారనీ... ఆ వ్యక్తిని అంబేద్కర్ గురువుగా భావించేవారనీ అన్నారు. నిజమే కావచ్చు- కానీ, వైదిక/ హిందూ- మతవాదులు, మనువాదులు చేసిన దాష్టీకం గురించి అంబేద్కర్ ఎన్నో రచనలు, ప్రసంగాలు చేశారు. చివరకు ఆయన హిందూ మతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. బుద్ధుణ్ణి హిందూమతంలో కలుపుకున్నట్లు, దశావతారాల్లో ఒకడిగా చేసుకున్నట్లు - ముస్లిం అయిన సాయిబాబాను హిందూ దేవుడిగా ఆరాధిస్తున్నట్లు- రేపు అంబేద్కర్‌ను కూడా దేవుణ్ణి చేసే ప్రమాదం ఉంది. మనిషిని మనిషిగా ఉండనివ్వండి రా బాబూ- మీ స్వార్థ ప్రయోజనాల కోసం, మీ పొట్టకూటి కోసం... ఎందుకు మనుషుల్ని దేవుళ్లుగా చేస్తారూ? ఇక్కడ బ్రాహ్మణులను గురించి డా.బి.ఆర్. అంబేద్కర్ ఏమన్నారో చూద్దాం- “బ్రాహ్మణుడికి మతం వల్ల ఉపాధి లభిస్తుంది. కాబట్టి అతను మతం గురించే గొప్పగా మాట్లాడతాడు. దళితులకు రాజ్యాంగం వల్ల ఉపాధి లభిస్తుంది కాబట్టి వాళ్లు రాజ్యాంగం గొప్పతనం గురించే మాట్లాడాలి. మతం గొప్పతనం గురించి కాదు- రాజ్యాంగాన్ని నమ్ముకుంటే నిన్ను చెప్రాసి నుంచి రాష్ట్రపతిని చేస్తుంది. ఒకవేళ దళితులు మతాన్ని నమ్ముకుంటే అది మళ్లీ వాళ్లను అంటరానివాళ్లుగా, శూద్రులుగా, నిరక్షరాస్యులుగా, బానిసలుగా చేస్తుంది.” మనువాదుల వల్ల వారి కొమ్ముకాస్తున్న బహుజనుల వల్ల సమకాలీనంలో అనేక అనర్థాలు జరుగు తున్నాయి. మనిషి కేంద్రంగా, రాజ్యాంగం కేంద్రంగా నిర్ణయాలు ఆచరణలో ఉండి ఉంటే, దేశంలో పరిస్థితి మరో రకంగా ఉండి ఉండేది. స్వాతంత్ర్య సమరంలో ముందు నిలిచిన గాంధీజీయే, మతం విషయంలో మనువాదులను అనుస రించాడు. జస్టిస్ మార్కండేయ ఖట్జూ గాంధీజీ గురించి చెప్పిన మాటల్లో యదార్థమెంత ఉందో విశ్లేషించుకోవాలి. “రాజకీయాల్లోకి మతాన్ని జొప్పించింది గాంధీజీయే. దాని వల్లే ఈ దేశ రాజకీయాలు భ్రష్టు పట్టాయి. గాంధీజీ ఎప్పుడూ గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడేవారు కానీ, వాస్తవంలో ఏమయ్యిందీ? గ్రామాలు అగ్రవర్ణాల, భూస్వాముల ఆధిపత్యంలోకి వెళ్లిపోయాయి. పైగా, కుటీర పరిశ్రమలంటూ పారిశ్రామికీకరణను అడ్డుకున్నారు. గాంధీజీ వలె దేశ ప్రజలందరూ చరఖా తిప్పి దేశాన్ని అభివృద్ధి చేసుకోవాలని అనుకోవడం- ఒక పనికిరాని ఆలోచన!!- ప్రెస్ కైన్సిల్ ఛైర్మన్ అయిన జస్టిస్ మార్కండేయ ఖట్జూ అలోచనల్లో నిజం లేకపోలేదు. ఈ రోజు బహిరంగంగా, అధ్వాన్నంగా మతాన్ని ఆధారం చేసుకుని, ఒక పార్టీ అధికారంలో కొనసాగుతుందంటే- అందుకు కారణం గాంధీజీయే. చివరకు ఆయన ప్రాణం బలి తీసుకున్నది కూడా ఒక మత విద్వేషకుడేనన్నది గుర్తుంచుకోవాలి! 'ఈశ్వర్ అల్లా తేరేనామ్'- అంటూ మత సామరస్యానికి పాటుపడ్డారేగానీ, మతాన్ని నిరసించలేదు. వైజ్ఞానిక అవగాహన గూర్చి మాట్లాడలేదు. ఆ పని, తర్వాత కాలంలో పండిట్ నెహ్రూ చేసుకుంటూ వచ్చారు. మతం- ఆధ్యాత్మికత- సైన్సుల పరిధులేమిటో తెలుసుకోవడానికి ఇక్కడ ఒక దృశ్యం చూపెడతాను. ఒక మత గురువు చిన్న గోచిగుడ్డ తప్ప మరేమీ లేకుండా అంటే దాదాపు నగ్నంగా కూర్చుని భక్తులకు మతం- ఆధ్యాత్మికత- దైవశక్తి గూర్చి బోధిస్తున్నాడు. అయితే అతను కళ్లజోడు పెట్టుకుని ఉన్నాడు. మరి అది ఎందుకూ? తన ఆత్మశక్తితో ఎదురుగా కూర్చుని ఉన్న భక్తజనాన్ని చూడొచ్చు కదా? ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిందేమంటే- మతపిచ్చి అతని గుడ్డలిప్పదీసి నగ్నంగా కూర్చోబెట్టింది. మతం అతణ్ణి అనాగరికుణ్ణి చేసింది. ఇక కళ్లజోడు అంటే సైన్సు- అతనికి చూపునిచ్చింది. మత పిచ్చితో గుడ్డివాడైన వాడు కూడా సైన్సుపై ఆధారపడక తప్పలేదు. ఎదురుగా ఉన్న మైకు, కళ్లద్దాలు తీసేసి జనానికి ఏమైనా బోధించగలడా? ఆలోచించుకోవాలి! మతం గొప్పదా? విజ్ఞాన శాస్త్రం గొప్పదా అనేది అర్థం చేసుకునేవాడికి, విషయం చెప్పకుండానే అర్థమవుతుంది! మతం ఆధారంగా అధికారంలో కొనసాగుతున్న నేటి కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో జరుగుతున్న దురాగతాలు ఎన్నని చెప్పగలం? ఎటుచూస్తే అటు లెక్కలేనన్ని ఉన్నాయి. రైల్వే రక్షక దళం (ఆర్‌పిఎఫ్) కి చెందిన ఒక కానిస్టేబుల్ కదులుతున్న రైల్లో ముగ్గురు ముస్లింలను కాల్చి చంపాడు. మరోచోట ఒక ముస్లిం విద్యార్థిని వరుసగా క్లాసులోని తోటి విద్యార్థులంతా చెంపపై కొట్టాలంటూ... ముజఫర్ నగర్‌లో ఒక స్కూలు టీచరు తన విద్యార్థులను ఆదేశించింది. దేశవ్యాప్తంగా కాషాయ మూకలు ముస్లిం వ్యతిరేక ప్రసంగాలు చేయడం, ముస్లింలపై దాడులకు దిగడం జరుగుతున్న నేపథ్యంలో బిదూరీ విద్వేష ప్రసంగాలను కూడా చూడాల్సి ఉంది. ముస్లింలను సమూలంగా నిర్మూలించా లంటూ 'ధర్మ సంసద్' లు పిలుపునివ్వడం, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని, గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నారనే నెపంతో ముస్లింలను వేధించి కొట్టి చంపడమనేది హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నిత్యం జరుగుతున్న విషయం- దేశ ప్రజలు గమనిస్తున్నారు. దేశంలో ప్రభుత్వం శాంతిభద్రతలు కాపాడటమంటే ఇదేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఉగ్ర వాదాన్ని యూరప్ దేశాల్లో 'టెర్రరిజం' అని అంటారు. ముస్లిం దేశాల్లో 'జీహాద్' అని అంటారు. దాన్నే సమకాలీన భారతదేశంలో 'సనాతన ధర్మం' అని అంటారని ఈ దేశ ప్రజలు నిర్వచించుకుంటున్నారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

ప్రజల పక్షాన గట్టిగా పోరాడతా: సోరెన్

రాంచీ: ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతానని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పేర్కొన్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. తాను జైలు నుంచి విడుదలయ్యే సమయంలో తన చేతిపై వేసిన ఖైదీ గుర్తు ఫొటోను ఎక్స్‌లో పంచుకున్నారు. దానిని ప్రస్తుతం ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లకు చిహ్నంగా అభివర్ణించారు. 'ఇటీవల జైలు నుంచి విడుదలైనప్పుడు నా చేతిపై వేసిన ఈ గుర్తు నాది మాత్రమే కాదు. దేశ ప్రజలందరిది. ప్రస్తుతం మన ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇది చిహ్నం. ఎలాంటి ఫిర్యాదులు, సాక్ష్యాధారాలు లేకుండా ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని 150 రోజులు జైల్లో ఉంచారు. ఇక సామాన్య గిరిజనులు, దళితులు, అణగారిన వర్గాల విషయంలో ఏవిధంగా వ్యవహరిస్తారో అర్థమవుతోంది' అని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు నుంచి అన్నివర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడాలని మరింత దృఢంగా సంకల్పించుకున్నట్లు సోరెన్ తెలిపారు. కులం, మతం, రంగు, వస్త్రధారణ వల్ల సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల తరపున పోరాడతానని స్పష్టం చేశారు. అందరికీ సమన్యాయం, హక్కులు ఉండే సమాజాన్ని నిర్మించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముక్తిమోర్చ కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్‌ను జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన బిర్సాముండా జైల్లో ఉన్నారు. జూన్ 28న ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఐదు నెలల తర్వాత జులై నాల్గో తేదీన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు.

చెన్నై విమానాశ్రయంలో ఏడంచెల భద్రత

చెన్నై: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై విమానాశ్రయంలో ఏడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దీని కారణంగా స్వదేశీ ప్రయాణికులు గంటన్నర ముందు, అంతర్జాతీయ విమాన ప్రయాణికులు మూడున్నర గంటల ముందుగా విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. త్రిశూలం నుంచి మీనంబాక్కం వరకు ఉన్న స్వదేశీ, అంతర్జాతీయ విమానాశ్రయాలు, కార్గో విమానాలకు ఇంధనం నింపే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నాయి. ఈ నెల 15న జరిగే దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాలను భగ్నం చేసేలా ఉగ్రదాడి జరిగే అవకాశ ముందని కేంద్ర హోంశాఖకు రహస్య సమాచారం అందింది. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, జనసమ్మర్ధం గల ప్రాంతాలు, ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. అందులో భాగంగా చెన్నై విమానాశ్రయంలోనూ ఏడంచెల భద్రత ఏర్పాటు చేశారు. గడిచిన రెండు నెలల కాలంలో చెన్నై విమానాశ్రయానికి పదిసార్లు బాంబు బెదిరింపు రావడంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో ఐదంచెల భద్రత కొనసాగుతోంది. విమానాశ్రయం బయట స్థానిక పోలీసులు, లోపల కేంద్ర పారిశ్రామిక బలగాలు గస్తీ చేపట్టాయి. విమానాశ్రయానికి వచ్చే వాహనాలను ప్రవేశ ద్వారం వద్దే ఆపి భద్రతా దళాలు తనిఖీ చేసిన తరువాతే లోపలికి పంపిస్తున్నాయి. ప్రయాణికుల లగేజీని మెటల్ డిటెక్టర్లతో పరిశీలిస్తున్నారు. విమానాశ్రయ భద్రత దృష్ట్యా సందర్శకుల ప్రవేశంపై ఇప్పటికే నిషేధం విధించారు.

మహిళాభివృద్ధికే 'వక్ఫ్' చట్ట సవరణ

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ

చెన్నై: మహిళల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఆమె శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలు తరతరాల నుంచి మతం పేరుతో ఆచరిస్తున్న 'ముత్తలాక్' పేరుతో మహిళలను బానిసలుగా చూశారని, ఏ వర్గంలో అయినా మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు.
నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముత్తలాక్ చట్టాన్ని నిషేధించి... ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించడంతో పాటు ఆస్తులపై సమాన హక్కు కూడా వర్తింపజేసిందని తెలిపారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు కూడా ముస్లిం మతపెద్దలతో చర్చించిన తర్వాతే తీసుకొచ్చారని, అయితే ఈ బిల్లును ప్రతిపక్షాలు రాజకీయం కోసం వ్యతిరేకించడం సరికాదని ఖుష్బూ చెప్పుకొచ్చారు.

'క్రీమీలేయర్' తీర్పు రద్దు కోసం చట్టం

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే డిమాండ్



న్యూఢిల్లీ: క్రీమీలేయర్ భావనతో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను నిరాకరించే ఆలోచన 'ఖండించదగినది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే శనివారం నొక్కి చెప్పారు. ఈ అంశంపై సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేయడానికి ప్రభుత్వం పార్లమెంటులో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల ప్రారంభంలో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 6:1 మెజారిటీ తీర్పులో అనుభవపూర్వక వివరాల ఆధారంగా ఎస్సీ జాబితాలోని వర్గాలను ఉప వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతి ఉందని తీర్పు చెప్పింది. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ)లలో కూడా క్రీమీలేయర్‌ను గుర్తించే విధానాన్ని రాష్ట్రాలు రూపొందించాలని, వారికి రిజర్వేషన్ల ప్రయోజనాన్ని నిరాకరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ అన్నారు. 'క్రీమీలేయర్ తీసుకురావడం ద్వారా మీరు ఎవరికి ప్రయోజనం చేకూర్చాలనుకుంటున్నారు? ఒకవైపు క్రీమీలేయర్ భావనను తీసుకురావడం ద్వారా మీరు అంటరానివారిని తిరస్కరించారు. వేల సంవత్సరాలుగా విశేషాధికారాలు అనుభవిస్తున్న వారికి ఇస్తున్నారు. దీనిని నేను ఖండిస్తున్నాను' అని ఖడ్గే శనివారం ఇక్కడ విలేకరులతో అన్నారు. ఏడుగురు న్యాయమూర్తులు లేవనెత్తిన ఈ క్రీమీలేయర్ అంశం ఎస్సీ, ఎస్టీల గురించి సీరియస్‌గా ఆలోచించలేదన్న విషయాన్ని తెలియజేస్తోందని తెలిపారు. అంటరానితనం ఉన్నంత వరకు రిజర్వేషన్లు ఉండాలని, అలాగే ఉంటాయని, దాని కోసం పోరాడతామని అన్నారు. రిజర్వేషన్లను అంతం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, కేంద్రం ప్రభుత్వ రంగ ఉద్యోగాలను ప్రైవేటీకరించిందని, చాలా ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలు ఉద్యోగాలు పొందలేకపోతున్నారని, ఉన్నత స్థాయి స్థానాల్లో ఎస్సీలు లేరని, క్రీమీలేయర్‌గా వర్గీకరించి ఎస్సీ, ఎస్టీలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 'కోర్టు తీర్పు నాకు ఆశ్చర్యం కలిగించింది. నిజ జీవితంలో అంటరానితనాన్ని ఎదుర్కొంటున్న వారు, ఉన్నత పదవులలో కూడా ఎస్సీ, ఎస్టీలకు చెందిన వారు వివక్షను ఎదుర్కొంటున్నారు. డబ్బు ఉంటే కూడా వారు వివక్షను ఎదుర్కొంటారు' అని ఖడ్గే అన్నారు. 'ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, ఈ తీర్పునకు గుర్తింపు రాకుండా చూసుకోవాలని, ఈ విషయాన్ని మళ్లీ లేవనెత్తకూడదని నేను విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను' అని చెప్పారు. ఉప వర్గీకరణకు సంబంధించిన ఇతర అంశాలపై కాంగ్రెస్ చర్చిస్తోందని, వివిధ రాష్ట్రాల మేధావులు, నేతలతో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని, ఎస్సీ, ఎస్టీల రక్షణకు అన్ని విధాలా కృషి చేస్తామని ఖడ్గే తెలిపారు. 'మేము దీనిని తాకబోమని ప్రధాని చెప్పారని నేను చదివాను. క్రీమీలేయర్ అమలు చేయబడదని నిర్ధారించడానికి, వారు పార్లమెంటులో చట్టం తీసుకువచ్చి, సుప్రీం కోర్టు తీర్పును రద్దు చేయాలి' అని అన్నారు. ఈ ప్రభుత్వం కొన్ని గంటల్లో బిల్లులు సిద్ధం చేస్తుందని, ఇప్పుడు తీర్పు వెలువడి దాదాపు 15 రోజులు అయిందని ఆయన అన్నారు. బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌కు సంబంధించి ఎలాంటి నిబంధన లేదని కేంద్ర మంత్రివర్గం తేల్చిచెప్పిన మరుసటి రోజు ఖడ్గే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

చీనాబ్ లోయకు ఫరూక్

శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ సిద్ధమవుతున్నందున మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా చీనాబ్ వ్యాలీని సందర్శించనున్నారు. అసెంబ్లీ ఎన్నికలు 'త్వరలో' జరుగుతాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసిన ఒక రోజు తర్వాత, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో మమేకమై ఎన్నికల సంసిద్ధతను నిర్ధారించడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌సీ శనివారం తెలిపింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఆదివారం జమ్మూ ప్రాంతంలోని దోడా, కిష్త్వార్, రాంబన్ జిల్లాలతో కూడిన చీనాబ్ వ్యాలీని సందర్శించి పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలను నిర్వహించనున్నట్లు ఎన్‌సీ అధికార ప్రతినిధి తెలిపారు. కిందిస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష సంబంధాలను కొనసాగించేందుకు, రాబోయే ఎన్నికల సమరానికి వారిని సమీకరించేందుకు పార్టీ నిబద్ధతను ఈ పర్యటన నొక్కి చెబుతోందని ఆయన అన్నారు. 'రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడమే రాబోయే సమావేశాల ప్రాథమిక లక్ష్యం. అబ్దుల్లా పార్టీ శ్రేణులతో లోతైన చర్చలు జరుపుతారని, వ్యూహాత్మక మార్గనిర్దేశాన్ని అందజేస్తారని, అట్టడుగు స్థాయిలో చురుగ్గా పాల్గొనవలసిన ప్రాముఖ్యతను నొక్కి చెబుతారు' అని వివరించారు. చీనాబ్ లోయ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ లక్ష్యాలు, వ్యూహాలను రూపొందించేందుకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆయన అన్నారు. రత్తన్ లాల్ గుప్తా, ఖలీద్ నజీబ్ సుహార్వార్ది, సజ్జాద్ కిచ్లూ, విజయ్ లోచన్, తన్వీర్ కిచ్లూ, జఫరుల్లా, మెహబూబ్ ఇక్బాల్, సజ్జాద్ సాహీన్‌లతో సహా అనేక మంది కీలక ఎన్‌సీ నాయకులు ఈ పర్యటనలో ఫరూక్ అబ్దుల్లాతో పాటు రానున్నారు.

తీహార్ జైలు అధికారిపై వేటు

న్యూఢిల్లీ: తీహార్ జైలు అధికారి ఒకరు తుపాకీ చేతపట్టుకొని డ్యాన్స్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఈ వీడియోపై స్పందించిన జైలు ఉన్నతాధికారులు అతడిపై వేటు వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దీపక్ శర్మ అనే వ్యక్తి తీహార్ జైల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. జైలు పరిధిలోని మాండోలి కారాగారంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే, ఇటీవలే ఓ కార్యక్రమానికి వెళ్లిన దీపక్... అక్కడ డ్యాన్స్ చేశాడు. తన సర్వీస్ రివాల్వర్‌ను చేత్తో పట్టుకుని చుట్టూ ఉన్న వారిపై గురి పెడుతున్నట్లుగా ఫోజులిస్తూ డ్యాన్స్ చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇది ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. వీడియోపై స్పందించిన జైలు అధికారులు దీపక్‌పై చర్యలు చేపట్టారు.

50 గ్రాములు రూ.850 కోట్లు

బీహార్‌లో కాలిఫోర్నియం స్వాధీనం

పాట్నా: అత్యంత విలువైన రేడియో ధార్మిక కాలిఫోర్నియంను బీహార్‌లోని గోపాల్ గంజ్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. దాదాపు 50 గ్రాముల బరువున్న ఈ పదార్థం విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.850 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ స్వార్న్ ప్రభాత్ ధ్రువీకరించారు. నిందితులు ఈ పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. 'మా జిల్లా నుంచి విలువైన రేడియో ధార్మిక పదార్థాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు తమకు సమాచారం అందింది. దీంతో మేం బృందాలు సిద్ధం చేశాం. జిల్లా దర్యాప్తు విభాగాన్ని అప్రమత్తంగా ఉంచాం. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, ఎస్టీఎఫ్ దళాలను రంగంలోకి దించాం. వీరిని ఉత్తరప్రదేశ్-బీహార్ సరిహద్దుల్లో మోహరించాం. ఈ సమయంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా... నాలుగు మొబైల్ ఫోన్లతోపాటు 50 గ్రాముల కాలిఫోర్నియం బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని ధర గ్రాము రూ.17 కోట్లు' అని ఎస్పీ ప్రభాత్ వెల్లడించారు. నిందితులను చోటే లాల్ ప్రసాద్, చందన్ గుప్తాగా గుర్తించారు. వారు ఈ కాలిఫోర్నియంను విక్రయించేందుకు కొన్ని నెలలుగా యత్నిస్తున్నట్లు చెప్పారు. దర్యాప్తును ముందుకు తీసుకెళ్లేందుకు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించామన్నారు. కాలిఫోర్నియంను పోర్టబుల్ మెటల్ డిటెక్టర్లలో వినియోగిస్తారు. వీటితో బంగారం, వెండి ఇతర విలువైన లోహాలు గుర్తించవచ్చు. దీంతోపాటు ఇంధన బావుల్లో నీరు, చమురు పొరలు గుర్తించేందుకు వాడతారు. ఇక విమానాల్లో లోహాల అరుగుదలను అంచనావేసేందుకు ఉపయోగిస్తారు.

శరద్ పవార్‌తో ఎమ్మెల్యే బచ్చు కదూ భేటీ

పూణె : ప్రహార్ జనశక్తి పార్టీ (పీజేపీ) అధ్యక్షుడు, అధికార మహాయుతి మిత్రపక్షం ఎమ్మెల్యే ఓం ప్రకాశ్ అలియాస్ బచ్చు కదూ శనివారం ఇక్కడ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్‌ను కలిశారు. అమరావతిలోని అచల్‌పూర్ నియోజకవర్గానికి చెందిన శాసనసభ్యుడు మోదీబాగ్‌లోని పవార్ నివాసానికి ఉదయం వెళ్లారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'రైతులు, కూలీలు, వికలాంగుల సమస్యలపై సమావేశంలో చర్చించాలని అనుకున్నాం. నేను ఎవరితోనూ నిరాశ చెందను. మహాయుతి నుంచి వైదొలగడం లేదా కూటమితో కొనసాగడం గురించి సెప్టెంబరు 1న నిర్ణయం తీసుకుంటాం' అని చెప్పారు. శుక్రవారం ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన ర్యాలీలో కదూ మాట్లాడుతూ రైతులు, పేదల డిమాండ్లను నెరవేర్చకుంటే రానున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో 10 వేలకు పైగా ఓట్లను కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్‌సీపీ (ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే మాట్లాడుతూ కదూతో మాకు భిన్నమైన రాజకీయ సిద్ధాంతాలు ఉన్నప్పటికీ, ఆయన వికలాంగుల కోసం పనిచేశారు.
రాష్ట్రాభివృద్ధికి అందరూ కలిసి రావాలని కోరుకుంటున్నాను. ప్రహార్ జనశక్తి పార్టీ ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, బీజేపీ, అజిత్ పవార్‌కు చెందిన కూడిన పాలక మహాయుతికి మిత్రపక్షం. అక్టోబరులో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 స్థానాలకుగాను 20 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేయాలని చూస్తోందని కదూ గతంలో చెప్పారు.

మిహిర్‌షా రక్త నమూనాల్లో మద్యం ఆనవాళ్లు లేవు

ముంబై: బీఎండబ్ల్యూ కారుతో ఢీ కొట్టి ఓ మహిళ మృతికి కారణమైన హిట్ అండ్ రన్ కేసులో ముంబై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, శివసేన నేత (షిండే వర్గం) రాజేష్ షా కుమారుడు మిహిర్ షాను పోలీసులు విచారిస్తున్నారు. మద్యం మత్తులో మిహిర్ షా కారు నడిపినట్లు పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తాజాగా ఈ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడి రక్తం, మూత్ర పరీక్షలు నెగెటివ్ వచ్చాయి. ఆ నమూనాల్లో మద్యం ఆనవాళ్లు లేవని తేలింది. మిహిర్ షా రక్తం, మూత్ర నమూనాల్లో మద్యం జాడలు కనిపించలేదని పోలీసులు తాజాగా తెలిపారు. ఘటన జరిగిన 58 గంటల తర్వాత మిహిర్ షాను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ప్రమాదానికి, నమూనాల సేకరణకు మధ్య ఎక్కువ సమయం ఉండటం వల్ల పరీక్ష ఫలితాలు ప్రతికూలంగా వచ్చి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు అవసరం

నిర్మలా సీతారామన్ సూచన

న్యూఢిల్లీ: డిపాజిట్లు తగ్గుతున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులకు కీలక సూచన చేశారు. ప్రజల నుంచి డిపాజిట్లు ఆకర్షించడానికి వినూత్న ఉత్పత్తులు తీసుకురావాలని సూచించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బోర్డు సమావేశం అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. రుణాలకు, డిపాజిట్లకు సమతూకం ఉండాలన్నారు. డిపాజిట్ల సేకరణ విషయంపై బ్యాంకులు దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ అన్నారు. తద్వారా వచ్చిన నిధులను అవసరమైన వారికి రుణాలుగా సమకూర్చాలన్నారు. అప్పుడే డిపాజిట్లకు, రుణాలకు మధ్య గల అంతరం తగ్గుతుందన్నారు. ఇందులో భాగంగా వినూత్న, ఆకర్షణీయ డిపాజిట్ పథకాలు తీసుకురావాలని బ్యాంకులకు సూచించారు. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సైతం దీనిపై మాట్లాడారు. వడ్డీ రేట్లను డీ రెగ్యులేట్ చేశామని, బ్యాంకులు సొంతంగా డిపాజిట్లు పెంచుకోవడానికి వెసులుబాటు ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో బ్యాంకులకు ఆ స్వేచ్ఛ ఉందన్నారు.

ఉగ్రవాదుల సమాచారమిస్తే రూ.5 లక్షల రివార్డ్

ఊహాచిత్రాలు విడుదల

జమ్మూకశ్మీర్: గత కొన్ని నెలలుగా జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు... భద్రతాబలగాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. లోయ ప్రాంతాల్లో దాక్కుని భద్రతా బలగాలను దొంగదెబ్బ తీసేందుకు కుట్ర పన్నుతున్నారు. వారి దాడుల్లో ఎంతో మంది జవాన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో కశ్మీర్ లోయలో ఉగ్రవాద కార్యకలాపాలను కట్టడి చేసేందుకు అక్కడి పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలోనే అనుమానిత ఉగ్రవాదుల ఫొటోలను రిలీజ్ చేసి రివార్డులు ప్రకటిస్తున్నారు. తాజాగా నలుగురు ఉగ్రవాదుల ఊహాచిత్రాలను కథువా పోలీసులు శనివారం ఉదయం రిలీజ్ చేశారు. జిల్లాలోని మల్హర్, బని, సియోజ్ ధర్ లోయ ప్రాంతాల్లో కనిపించిన ఉగ్రవాదుల ఊహాచిత్రాలను గీసి ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. వారిని పట్టుకునేందుకు రివార్డు కూడా ప్రకటించారు. ఫొటోల్లో ఉన్న ఉగ్రవాదుల గురించిన సమాచారం అందించిన వారికి రూ.5లక్షల నగదు బహుమతి ప్రకటించారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికుల మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో శనివారం ఎన్‌కౌంటర్ జరిగింది. మారుమూల అటవీ ప్రాంతంలో నక్కివున్న ఉగ్రవాదులకు భద్రతా దళాలకు మధ్య పోరులో ఇద్దరు సైనికులు అమరులయ్యారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ మేరకు సైన్యం తెలిపింది. తనిఖీ బృందాలను గుర్తించిన ముష్కరులు విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. కాల్పుల్లో ఐదుగురు జవాన్లు గాయపడగా వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని, దురదృష్టవశాత్తు ఇద్దరు చనిపోయారని వెల్లడించారు. అనంతనాగ్ జిల్లాలోని కోకర్‌నాగ్‌లోగల అహ్లాన్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిందని జమ్మూకశ్మీర్ పోలీసులు పేర్కొన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా భారత సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా తనిఖీలు చేపట్టినట్లు శ్రీనగర్‌లోని చినార్ కార్ప్స్ 'ఎక్స్'లో పేర్కొంది. ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు ఆ ప్రాంతాన్ని జల్లెడ పడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఊచకోత

బెగుసరాయ్: బీహార్‌లోని బెగుసరాయ్‌లో దారుణం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని గొంతుకోసి హత్య చేసేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో భర్త, భార్య, కుమార్తె మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దారుణానికి పాల్పడిన నేరస్తులు ఆ కుటుంబంలోని నలుగురిపైన యాసిడ్ కూడా పోశారు. గాయపడిన కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. బచ్వారా పోలీస్ స్టేషన్ పరిధిలోని రషీద్‌పూర్‌లోని చిరంజీవిపూర్ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. ఈ ప్రాంతానికి చెందిన సంజీవన్ మహతో తన కుటుంబ సభ్యులందరితో పాటు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. నేరస్తులు పదునైన ఆయుధంతో సంజీవన్ మహతోను ఆయన భార్య సంజితా దేవి, కుమారుడు అంకుశ్ కుమార్, కుమార్తె సప్నా కుమారి గొంతు కోశారు.

హంతకుడిని ఉరితీయడానికి వెనుకాడం

జూనియర్ వైద్యురాలి హత్యపై చర్యలకు మమత హామీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జూనియర్ వైద్యురాలి హత్యపై సీఎం మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. అవసరమైతే హంతకుడికి ఉరి శిక్ష వేయించడానికి తమ ప్రభుత్వం వెనుకాడదని పేర్కొన్నారు. దీనిని ఓ దురదృష్టకర ఘటనగా ఆమె అభివర్ణించారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. 'ఈ కేసు విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టులో నిర్వహించాలని అధికారులకు సూచిస్తున్నా. హంతకుడికి కచ్చితంగా కఠిన శిక్ష పడాలి. ఆందోళన చేస్తున్నవారికి ప్రభుత్వంపై నమ్మకం లేకపోతే కచ్చితంగా ఇతర లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీని ఆశ్రయించొచ్చు. ఎటువంటి ఇబ్బంది లేదు. ఏ విధంగానైనా హంతకుడికి కఠిన శిక్షపడాలి. నిరసన తెలుపుతున్న వైద్యులు రోగులకు చికిత్స అందించాలి. మాకు ఎలాంటి బాధ్యత ఉంటుందో... ఆసుపత్రి సూపరింటెండెంట్‌కూ అంతే బాధ్యత ఉంటుంది. అవసరమైతే వారి నిర్లక్ష్యంపై కూడా దర్యాప్తు చేపడతాం' అని పేర్కొన్నారు. ప్రతిపక్ష బీజేపీ ప్రతినిధి అగ్నిమిత్ర పాల్ మాట్లాడుతూ... జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశారన్నారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.
జూనియర్ వైద్యురాలి హత్య కేసుకు సంబంధం ఉందన్న అనుమానంతో పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. అతడు ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో స్వేచ్ఛగా తిరిగినట్లు గుర్తించారు. ఆసుపత్రితో ఆ వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదు. అతడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని పోలీసులు పేర్కొన్నారు. అతడు నేరంలో పాల్గొన్నట్లు అనుమానాలున్నాయని పోలీసు అధికారులు పీటీఐ వార్త సంస్థకు వెల్లడించారు. తెల్లవారుజామున 3-6 గంటల మధ్య ఆమె హత్యకు గురై ఉండొచ్చని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇదిలా ఉండగా పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జూనియర్ వైద్యురాలు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. ఆసుపత్రి సెమినార్ హాలులో శుక్రవారం ఉదయం అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఆమె మర్మాంగాలు, నోరు, కళ్ల నుంచి రక్తస్రావం జరిగినట్లు శవపరీక్షలో తేలింది. ఆమెపై లైంగిక దాడి జరిగినట్టు ప్రాథమిక నిర్ధారణ అయింది. శరీరంపై వివిధ చోట్ల గాయాలు కనిపించాయి.

పోస్టుమార్టం నివేదికలో కీలక విషయాలు

స్థానిక ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో శవమై తేలిన వైద్యురాలి పోస్టుమార్టం నివేదికలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని పోలీస్ ఉన్నతాధికారి శనివారం కోల్‌కతాలో వెల్లడించారు. లైంగిక దాడి చేసి అనంతరం ఆమెను దారుణంగా హత్య చేసినట్లు స్పష్టమైందన్నారు. ఆమె ప్రైవేట్ పార్ట్స్ నుంచి తీవ్రంగా రక్త స్రావమైందని తెలిపారు. మృతదేహంపై తీవ్ర గాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. కాలేజీ పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్ పరిశీలించామన్నారు. వాటి ఆధారంగా ఈ కేసుకు సంబంధించిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేశామని పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు. అయితే అతడు మెడికల్ కాలేజీతో సంబంధం లేని వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు వైద్యులను సైతం అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని వివరించారు. పోస్టుమార్టం నివేదిక నిందితులను పట్టుకునేందుకు ఉపయోగపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు.

నిజాలు దాచిపెట్టే యత్నం: తండ్రి

ఈ ఘటనపై మృతురాలి తండ్రి స్పందించారు. ఆర్‌జీ మెడికల్ ఆసుపత్రిలో తమ కుమార్తెపై లైంగిక దాడి చేసి హత్య చేశారన్నారు. ఇందులో దాగిఉన్న నిజాలను దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానం వ్యక్తం చేశారు. తెల్లవారుజామున రెండు గంటల వరకు జూనియర్ డాక్టర్లతోనే ఆమె ఉందని... అనంతరం విశ్రాంతి తీసుకునేందుకు సమావేశ మందిరంలోకి వెళ్లిందని ఓ వైద్యుడు వెల్లడించారు. ఉదయం చూసే సరికి ఆమె విగతజీవిగా పడి ఉందన్నారు.

సహచర విద్యార్థుల కొవ్వొత్తుల ర్యాలీ

సహచర విద్యార్థిని మృతికి నిరసనగా వైద్య విద్యార్థులు శుక్రవారం రాత్రి కోల్‌కతాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ సౌగత్ రాయ్ స్పందించారు. నిందితులను ప్రభుత్వం పట్టుకుతీరుతుందని స్పష్టంచేశారు. ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం సిగ్గుచేటని... సిగ్గుతో తల దించుకుంటున్నానన్నారు. ఓ వైద్యురాలిపై దాడి చేయడం విషాదమని అభివర్ణించారు. కాగా, మెడికల్ కాలేజీ ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ స్పందిస్తూ వైద్యవిద్యార్థిని మృతి కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇంత దారుణంగా హత్య చేసిన నిందితులను త్వరగా పోలీసులు పట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. .

చేతివృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో మనుగడలో ఉన్న చేతి వృత్తులను గుర్తించి, చేతివృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించటానికి కృషి చేయాలని అఖిల భారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు జేవీ సత్యనారాయణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడలో దాసరి భవన్‌లో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య అధ్యక్షతన శనివారం చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్రింది స్థాయిలోకి వెళ్లి అధ్యయనం చేసి వృత్తి సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన కోస్టల్ రెగ్యులేటర్ జోన్ విధానం వల్ల 500 మీటర్ల వరకు ఉన్న చేపల వేటను 50 మీటర్లకు కుదించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రద్దు చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. గత 11 సంవత్సరాలుగా చేనేత కార్మిక సంఘాలకు ఎన్నికలు జరగలేదని, తక్షణమే సంఘాలకు, సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. మగ్గం వేసే ప్రతి చేనేత కార్మికునికి నేతన్న నేస్తం పథకం అమలు చేయాలని, చేనేత కార్మికులతో పాటు ఇతర చేతి వృత్తి దారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికపై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించి వాటి ద్వారా చేతి వృత్తిదారులకు సబ్సిడీ రుణాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నామమాత్రంగా చేతివృత్తిదారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి నిధులు కేటాయించలేదని చెప్పారు. మత్స్య కార్మికులకు సంబంధించిన జీవో 217ను నూతన ప్రభుత్వం రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మత్స్య కార్మికులకు చేపలు పట్టుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో చెరువులను కేటాయించాలన్నారు. రజకుల దోబీ ఘాట్లు కబ్జాలకు గురి కాకుండా కాపాడాలని, దోబీ ఘాట్లకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా చేతి వృత్తిదారులందరికీ సబ్సిడీ రుణాలు, పనిముట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, ఏపీ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు, ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బుద్ధారపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి సీపీఐ బలోపేతం

జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేద్దామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పిలుపునిచ్చారు. బాపట్ల అంబేద్కర్ భవన్‌లో శనివారం సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అధ్యక్షతన పార్టీ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత మహమ్మద్ ముస్తాఫా సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. అనేక పోరాటాలు చేసి మృతి చెందిన సీపీఐ నాయకులకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఏఐటీయూసీ జాతీయ నాయకులు, రైతు సంఘం జాతీయ నాయకులు, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అతుల్‌కుమార్ అంజన్, సీపీఐ రాష్ట్ర కార్యాలయం మాజీ కార్యదర్శి డీఎస్ రామచంద్ర రావు మృతికి నివాళులర్పించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ ఎర్ర జెండా పేద ప్రజల తరపున పోరాటం చేస్తోందని, జెండా గొప్పతనాన్ని గ్రామ స్థాయిలో వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. బాపట్ల జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలను బలోపేతం చేసి ప్రజా పోరాటాలే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగాన్ని మార్చివేస్తానని చెప్పిన మోదీకి దేశ ప్రజలు ఓట్లతో గట్టిగా బుద్ధి చెప్పారని, బీజేపీ స్వంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేక చంద్రబాబు, నితీశ్ కుమార్‌పై ఆధారపడి మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు. అయోధ్యలోనూ బీజేపీ ఓటమి చెందిందన్నారు. తమిళనాడులో స్టాలిన్‌తో పాటు బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ ఏకమై మోదీని సున్నా సీట్లకే పరిమితం చేశారని తెలిపారు. కేరళలో బీజేపీ ఒకస్థానం గెలుచుకుందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి బీజేపీతో అంటగాకకుండా ఉంటే ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలకు ప్రజలు గెలిపించే వారని తెలిపారు. చంద్రబాబు నాయుడు అమలుకాని, ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఇచ్చారని, వాటిని తప్పక నెరవేర్చాలని కోరారు. అమరావతి రాజధాని నిర్మాణానికి గతంలో మోదీ ఇచ్చిన నీళ్లు, మట్టి కాకుండా నిధులు తీసుకురావాలని హితవు పలికారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికిపై ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ సంక్షేమమే తప్ప అభివృద్ధిపై ఏనాడూ ధ్యాస పెట్టలేదన్నారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను పట్టించుకోలేదని విమర్శించారు. నేడు పెట్టుబడిదారులు, కార్పొరేట్ అధిపతులు, కులం, మతం, ధనం, ప్రాంతం వర్గాలుగా రాజకీయాల్లోకి ప్రవేశించి అనైక్యత సృష్టిస్తున్నారని మండిపడ్డారు. చట్టసభల్లో ఎర్రజెండా తరపున ఎవరూ లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉంటుందని తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోనే ఉండాలని తొలుత తీర్మానం చేసింది సీపీఐ మాత్రమేనని అన్నారు. దేశంలో ఇప్పటి వరకు 14 మంది ప్రధాన మంత్రులు చేసిన అప్పు కంటే రెండింతల అప్పు మోదీ ఒక్కరే చేశారని తెలిపారు. చంద్రబాబు ఎన్డీఏ పల్లకీ మోస్తూనే ఉన్నారని, ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆలోచించిన దాఖలాలు లేవని విమర్శించారు. పార్టీ అన్ని గ్రామాల్లో విస్తరించాలని, ప్రజా సంఘాల నిర్మాణం జరగాలన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి తమవైపు తిప్పుకుంటున్న పార్టీల కంటే నేటి కాలంలో ఎర్రజెండాను పట్టి కడవరకు కొనసాగుతున్న వారికి జేజేలు పలకాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజలు ఈసారి ఎన్డీఏ కూటమిని కాదని, ఇండియా ఐక్య సంఘటనకు అండగా నిలబడ్డారని తెలిపారు. మొన్నటి వరకు జగన్... మోదీ భజన చేస్తే నేడు చంద్రబాబు అదే భజన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దాడులు, విధ్వంసాలు టీడీపీ ప్రభుత్వంలోనూ జరుగుతున్నాయన్నారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిధులు ఇవ్వకుంటే మద్దతు విరమించుకుంటా అని చెప్పగలవా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జేబీ శ్రీధర్, బత్తుల శామ్యూల్, తుమ్మల పుర్ణచంద్రశేఖర్, మల్లెల ఏసేబు, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, సైకం రాజశేఖర్, కె.ఎల్.డి.ప్రసాద్, నంబూరి సత్యం, కాలేషాగారి ఖాదర్ బాషా, మేడా వెంకటరావు, మేకల రమణయ్య, వల్లెపు నరసింహం, జె.రత్నకుమారి, సన్నమూరి శ్రీనివాసరావు, అద్దంకి నాగేశ్వరరావు, మామిడిబత్తుల అశోక్, కోటి దాసు, గెల్లా నాగరాజు, చీదర్ల కొండయ్య, గర్నెపూడి రాములు, ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, గెల్లా ఆరోను, అంజి తదితరులు ఉన్నారు.

కేబినెట్ కార్యదర్శిగా సోమనాథన్

న్యూదిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి టీవీ సోమనాథన్ శనివారం కేబినెట్ కార్యదర్శిగా నియమితులయ్యారు. రాజీవ్ గౌబ స్థానంలో సోమనాథన్ ఈ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 1987 బ్యాచ్ తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి సోమనాథన్ పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని నియామక ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఈనెల 30వ తేదీ నుంచి రెండేళ్ల పాటు కేబినెట్ కార్యదర్శిగా టీవీ సోమనాథన్ ఉంటారని, ఆయన నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ధ్రువీకరించిందని ఉత్తర్వుల్లో ఉన్నది. అలాగే బాధ్యతలు స్వీకరించిన రోజ నుంచి ఆయన కేబినెట్ సెక్రటేరియట్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా వ్యవహరిస్తారని కూడా పేర్కొంది. కాగా, 2019, ఆగస్టు 30 నుంచి ఐదేళ్ల పాటు కేబినెట్ కార్యదర్శిగా గౌబ కొనసాగిన విషయం విదితమే.

అందరివాడు రామచంద్రరావు

నారాయణ

హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన రామచంద్రరావు మృతి తీరని లోటని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ పేర్కొన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆరు దశాబ్దాలుగా సీపీఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శిగా సమర్థవంతంగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. నాయకుల కన్నా ముందే కార్యాలయానికి వచ్చి అన్నిపేపర్లు చదివి... అందులో ముఖ్యమైన వార్తలు అండర్‌లైన్ చేసి టేబుల్‌పై ఉంచే వారు. కార్యాలయానికి ఎవరువచ్చినా వారి స్థాయిని బట్టి వాళ్లతో మాట్లాడేవారు. ఎవరినీ బాధకలిగించే ప్రవర్తన ఉండేదికాదు. నాయకులు టూర్ నుండి కార్యాలయానికి వచ్చి...వారు తెచ్చిన నిధి తీసుకొని రసీదు ఇచ్చేవారు. ఇక అది ఇనుప పెట్టెలో ఉన్నట్టే. నాయకులు, కార్యకర్తల తరతమ స్థాయినిబట్టి వారితో మాట్లాడేవారు. సహజంగా గోదావరి జిల్లా నేపథ్యం. అందువల్ల ఆయనకు వెటకారాలు ప్రత్యేకత. రాజకీయపరంగా సీరియస్‌గానూ, మిగిలిన సమయంలో జోయల్‌గా ఉండేవారు. నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, పిల్లలు వస్తే మంచిగా మాట్లాడేవారు. అధికారులు, ఇతర రాజకీయ నాయకులు కార్యాలయానికి వస్తే తగిన మర్యాదలు చేసేవారు. నాకు, మా కుటుంబానికి సాన్నిహిత్యం ఒక్కమాటలో చెప్పలేను. ఆయనకు ఎపుడు సుస్తీ చేసినా నాకు కబురు చేసేవారు. ఎప్పుడైనా ఫోన్ చేసి ఎలా ఉన్నారంటే మీరుండగా నాకేమిటి అని సమాధానం. ఒకసారి నన్ను కలవాలని గోవింద్‌తో కబురు చేశారు. వెళ్లి కలిశాను. నేను చనిపోతే నా దేహాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనార్థం ఇవ్వండి అన్నారు. మరి మీ పిల్లలు ఏమైనా అంటారు అన్నాను. నో అంతా మీరే అన్నారు. నాకు మాటివ్వు అని గద్గద స్వరంతో అన్నారు. మాటిచ్చాను. అలాగే కుమారులలో చింతామణి బతికున్నంత కాలం ఆస్తి వాడిదే. తదనంతరం వారిష్టం అని మాటిచ్చాను. ఆ విషయం గోవిందుకు, డాక్టర్ రజనీకి తెలుసు. దురదృష్టం... ఈ సమయంలో నేను కేరళ రాష్ట్రం వాయనాడ్‌లో వరద బాధితులకు సహాయక చర్యల్లో పాల్గొనడా నికి వచ్చాను. వారి భౌతికకాయాన్ని చివరిగా చూడలేక పోతున్నందుకు బాధగా ఉన్నది. రామచంద్రరావు చెప్పినట్టుగానే ఆయన భౌతిక కాయాన్ని వైద్యకళాశాలకు అందజేయమని సీపీఐ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు తెలియజేశాను. కార్యాలయ సిబ్బంది నరసింహ, దశరథ, అంజి...కుటుంబ సభ్యుల కంటే ఎక్కువుగా రామచంద్ర రావును కంటికి రెప్పలా చూసుకున్నారు. రామచంద్రరావు సతీమణి మరణానంతరం ఆ ఇంటిలో ప్రతిరోజు వంట చేయడానికి నాగమణి సహాయపడేది. ఆయనకు కావాల్సిన వంటకం తయారు చేసి...ఆరోగ్యంగా చూసుకోవడంలో జాగ్రత్త వహించింది. ఆ ఇంటికి పెద్ద కొడుకులాగా డాక్టర్ కడలి సత్యనారాయణ (రాజోలు) చివరి వరకు అండగా ఉన్నారు. వైద్యసాయంలో డాక్టర్ రజనీ తోడుగా ఉన్నారు. ఇంకా అనేక మంది పార్టీ నాయకులు, సహాయకులు ఉన్నారు. రామచంద్రరావు మరణం పట్ల హృదయావేదనతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

రావుల వెంకయ్య సంతాపం

డీఎస్ రామచంద్రరావు మృతి పట్ల అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామచంద్రరావు అందరితో చాలా సన్నిహితంగా ఉండేవారనీ, అందరినీ అభిమానిస్తారనీ, ఆయన కూడా అందరి అభిమానం చూరగొన్నారన్నారు. నిబద్ధత, అంకిత భావం కలిగిన రామచంద్రరావు వంటి వ్యక్తి దొరకటం అసాధ్యమన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి అత్యుత్తమ సేవలు అందించారనీ, నైతిక విలువలకు, సంస్కారానికి రామచంద్రరావు నిలువటద్దంగా రావుల వెంకయ్య శ్లాఘించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ధన్యజీవి రామచంద్రరావు: జల్లి విల్సన్

నైతిక విలువలతో నిండు జీవితం గడిపిన ధన్యజీవి రామచంద్రరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. పాత, కొత్తతరం కమ్యూనిస్టు నాయకులకు, శ్రేణులకు వారధిగా నిలిచిన రామచంద్ర రావు పార్టీ కార్యాలయం మక్దూం భవన్‌కు వచ్చిన వారిని అప్యాయత, అనురాగం ఉట్టిపడేలా చిరునవ్వుతో పలకరించే వారన్నారు. రామచంద్రరావు పని సంస్కృతి, అంకితభావం, క్రమశిక్షణ నేటి తరానికి ఆదర్శంగా పేర్కొన్నారు. రామచంద్రరావు మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

ఆయనది విలక్షణ వ్యక్తిత్వం: ఓబులేసు

రామచంద్రరావు విలక్షణ వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు ఒక ప్రకటనలో కొనియాడారు. కమ్యూనిస్టు నైతిక విలువలకు, సంస్కారానికి ఆయన ప్రతిబింబంగా పేర్కొన్నారు. ఆయన మంచి చదువరనీ, మార్క్సిస్టు సాహిత్యం, షేక్స్పియర్, తెలుగు సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసేవారన్నారు. జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వివిధ పనులపై వచ్చి మక్దూం భవన్‌కు వచ్చిన నాయకులు, సాధారణ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి, ఏ పనిమీద వచ్చారో విచారించి చక్కటి సలహాలిచ్చి వారి కార్యభారాన్ని తగ్గించే వారన్నారు. ఆయన ఆశయాలను, పనితీరును నేటి తరం పుణికిపుచ్చుకోవాలన్నారు. రామచంద్ర రావు మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ఓబులేసు సానుభూతిని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీపీఐ కార్యాలయం మక్దూం భవన్ కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కోశాధికారిగా సుదీర్ఘకాలం సేవలందించిన డీఎస్ రామచంద్రరావు మృతి పట్ల సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం దాసరి నాగభూషణరావు భవన్ తరపున వై. చెంచయ్య, యడ్ల కృష్ణ కిశోర్ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాకు వెళ్తూ మే నెలలో మార్గమధ్యమంలో దాసరి భవన్‌ను రామచంద్రరావు సందర్శించి ఇక్కడి నాయకులు, సిబ్బందిని ఆప్యాయంగా పలకరించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు.

ఇజ్రాయిల్‌తో సంబంధాలొద్దు

- కేంద్రానికి సామాజిక-హక్కుల కార్యకర్తల డిమాండ్
- దిల్లీలో మౌన ప్రదర్శన: అడ్డుకున్న పోలీసులు
- అనీరాజా, జీన్ డ్రెజె సహా 10 మంది అరెస్టు

న్యూదిల్లీ: గాజాలో మరణహోమాన్ని ఆపాలని, తక్షణమే కాల్పులు విరమించాలని ప్రముఖ హక్కుల కార్యకర్తలు, ఆర్థికవేత్త జీన్ డ్రెజె, సీపీఐ నేత అనీరాజా డిమాండ్ చేశారు. పలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటించారు. న్యూదిల్లీలోని ఏపీజే అబ్దుల్ కలాం కూడలిలో మౌన ప్రదర్శన నిర్వహించారు. తొలుత ఖాన్ మార్కెట్ ప్రాంతం నుంచి ప్రదర్శన మొదలైంది. ఇజ్రాయిల్ దౌత్యకార్యాలయం వైపునకు నిరసనకారులు కదం తొక్కగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టుకు గురైన వారిలో అనీరాజా, జీన్ డ్రెజెతో పాటు రాజకీయ కార్యకర్తలు నదీం ఖాన్, ప్రియదర్శిని, విద్యావేత్తలు విజయన్ ఎంజే, అంజలి ఎస్ తదితరులు ఉన్నారు. వీరందరినీ మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ముందస్తు సమాచారం ఇచ్చినాగానీ అరెస్టు చేయడాన్ని నిరసనకారులు తప్పుపట్టారు. నాగాసాకి దినోత్సవాన్ని పురస్కరించుకొని పలస్తీనాకు సంఘీభావంగా శాంతియుత మార్చ్‌కు వివిధ సంఘాల నేతలు, కార్యకర్తలు పూనుకున్నట్లు అనీరాజా సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడులు, పలస్తీనా ప్రజల మారణహోమాన్ని వ్యతిరేకిస్తూ అనేక మంది హక్కుల కార్యకర్తలు, శాంతి కార్యకర్తలు చేపట్టిన ఆందోళనపై ఉక్కుపాదం మోపడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఒక ప్రకటనలో ఖండించింది. అనీరాజా, డ్రెజ్‌తో పాటు అనేకమంది అరెస్టులను ఆక్షేపించింది. పలస్తీనాకు మద్దతివ్వడమే భారత్ అధికారిక వైఖరి అయినప్పుడు దిల్లీ పోలీసులు ఈ విధంగా దుశ్చర్యకు పాల్పడటం ఆక్షేపణీయమని పేర్కొంది. ఇజ్రాయిల్‌తో తెగతెంపులు చేసుకోవాలని కేంద్రాన్ని నిరసనకారులు కోరారు. గాజాలో హింసకు భారత్ ప్రభుత్వం, కొన్ని కంపెనీలు సహకరిస్తున్నాయని పేర్కొంటూ అదానీ డిఫెన్స్, ఎయిరోస్పేస్ లిమిటెడ్, మ్యునిటిషయన్స్ ఇండియా, ప్రిమియర్ ఎక్స్‌ప్లోజివ్‌తో పాటు ప్రభుత్వ అనుమతులతో సాగే సైనిక కార్గో షిప్‌మెంట్లు, ఇజ్రాయిల్‌కు భారత కార్మికుల తరలింపు గురించి ప్రస్తావించారు. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలకు భారత్ కట్టుబడి ఉన్నదని గుర్తుచేస్తూ... మారణహోమాన్ని నిరోధించేందుకు తగు చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఇజ్రాయిల్‌కు సైనిక పరికరాల ఎగుమతులను ఆపేయాలని కోరారు. యుద్ధ నేరాలకు పాల్పడుతున్న దేశానికి ఆయుధాలు ఎలా ఇస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇజ్రాయిల్‌తో అధికారికంగా తెగతెంపులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పలస్తీనాలో దురాక్రమణకు సహకరిస్తున్న కంపెనీల ఉత్పత్తులను బహిష్కరించాలని భారతీయులను కోరారు. బాయ్‌కాట్, డిస్‌ఇన్వెస్ట్‌మెంట్, శాంక్షన్స్ (బీడీఎస్) ఉద్యమానికి పిలుపునిచ్చారు. పలస్తీనా ప్రజలను అణచివేసేందుకు ఇజ్రాయిల్‌కు అంతర్జాతీయ మద్దతు లేకుండా చేయడమే తమ పోరాట లక్ష్యంగా తెలిపారు. కాగా, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అరెస్టులు చేశామని, హుమాయున్ రోడ్డుకు వెళ్లేందుకు యత్నించిన పది మందిని నిర్బంధించి, తర్వాత వదిలేశామని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

బాలల చట్టాలపై అవగాహన అవశ్యం: జస్టిస్ ఠాకూర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: బాలలపై నేరాలు అరికట్టడానికి ప్రతిఒక్కరూ నిర్మాణాత్మక పాత్ర పోషించాలని, బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. పోస్కో, జువనైల్ చట్టాలపై పత్రికలు, ఇతర ప్రచార సాధనాలు ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (జువనైల్ జస్టిస్ కమిటీ) అధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో రాష్ట్ర ప్రభుత్వం (మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్) అసోసియేషన్‌తో బాలల హక్కుల పరిరక్షణపై జరిగిన రాష్ట్ర స్థాయి వార్షిక సదస్సును జస్టిస్ ధీరజ్ సింగ్ ప్రారంభించారు.

కృష్ణమ్మ పరవళ్లు

అన్నదాతల్లో ఆనందం

విశాలాంధ్ర బ్యూరో-కడప: వైయస్సార్ కడప జిల్లాకు కృష్ణాజలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. తెలుగుగంగ, గండికోట కాలువల ద్వారా సవ్వడి చేస్తూ కృష్ణమ్మ బిరబిరా పారుతోంది. కర్నూలు జిల్లాలోని వెలుగోడు నుంచి కృష్ణా జలాలు తెలుగంగ అంతర్భాగ ప్రాజెక్టుల్లో ఒకటైన సబ్సిడరీ రిజర్వాయర్ (ఎస్ఆర్-1)కు చేరుకొని అక్కడనుంచి ఎస్ఆర్-2కు చేరుకుంటాయి. కడప కలెక్టర్ శివశంకర్ లోతేటి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ ఎస్ఆర్-1 వద్ద శనివారం కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చి ఎస్ఆర్-2 కు నీటిని విడుదల చేశారు. కర్నూలు జిల్లాలోని అవుకు రిజర్వాయర్ నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, వైయస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ అతిదీ సింగ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, టీడీపీ జమ్మలమడుగు ఇన్చార్జి భూపేశ్‌రెడ్డి... గండికోటకు 11,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు గతేడాది వర్షాభావంతో ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ నీటిమట్టం అడుగంటడంతో రైతుల్లో నిరాశ ఏర్పడింది. ఈ తరుణంలో ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్నాటకలో కురిసిన వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా నీరు చేరి వినడం... అక్కడి నుంచి అవుకు, వెలిగోడు రిజర్వాయర్ లకు నీరు చేరడంతో వీటి నుంచి కడప జిల్లాలోని తెలుగు గంగ, గాలేరు నగరిలో అంతర్భాగమైన గండికోట ప్రాజెక్టులకు నీరు చేరుతుండడంతో జిల్లా రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

60 రోజుల్లో బ్రహ్మంసాగర్ నిండేలా...

తెలుగు గంగలో అంతర్భాగంగా జిల్లాలో ఎస్సార్-1, ఎస్ఆర్-2 లతోపాటు ప్రధాన రిజర్వాయర్ అయిన బ్రహ్మం సాగర్ ను 17 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. గత రెండేళ్ల క్రితం పూర్తి సామర్థ్యంతో నీరు ఉంచారు. గత ఏడాది నీరు అందలేదు. ఏడాది శ్రీశైలం నుంచి బాగా నీరు వస్తోంది. సాగర్‌లో పూర్తి స్థాయిలో నీటిమట్టం ఉంచాలన్న యోచనతో మైదుకూరు ఎమ్మెల్యేతో పాటు అధికారులు ఎస్సార్ 2కు నీరు విడుదల చేశారు. ఆ తర్వాత బ్రహ్మం సాగర్‌కి నీరు విడుదల చేస్తారు. వెలుగోడు నుంచి 5,000 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా కడప జిల్లా సరిహద్దు చేరేటప్పటికి 2,500 క్యూసెక్కులే వస్తున్నాయి. బ్రహ్మంసాగర్ కు చేరేటప్పటికి మరికొంత తగ్గే అవకాశం ఉంది. అయితే అధికారులు 60 రోజుల్లో పూర్తి సామర్థ్యంతో నీటిని నింపుతామని చెబుతున్నారు. దీంతో రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. నెల తర్వాతనైనా ఆయకట్టు క్రింద సాగుకు అవకాశం ఏర్పడుతుందన్న ఆశల్లో రైతులు ఉన్నారు. జిల్లాలో 96 వేల ఎకరాల ఆయకట్టు తెలుగుగంగ కింద సాగవుతుంది.

గండికోటకు దండిగా...

గాలేరు-నగరిలో అంతర్భాగంగా ఉన్న గండికోట రిజర్వాయర్... 27 టీఎంసీల సామర్థ్యానికి పైగా ఉండేలా నిర్మించారు. ప్రస్తుత నీటిమట్టం 1.44 టీఎంసీలు మాత్రమే ఉంది. అవుకు నుంచి 11,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో గండికోటకు ఆదివారం సాయంత్రం చేరుకోనుంది. రోజు ఒక టీఎంసీ నీరు చేరే పరిస్థితులు కనిపిస్తుండడంతో ఐదు వారాలకు అటు ఇటుగా గండికోట నిండే అవకాశముంది. గండికోట నుంచి పైడిపాలెం, సిబిఆర్ లిఫ్ట్ లకు, వామికొండ,సర్వారాయ సాగర్ రిజర్వాయర్ లకు నీరు వివిదుదల చేసేఅవకాశం ఉండడంతో పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంత రైతాంగాని ప్రయోజనం చేకూరుతుంది. ఈ ఏడాది జిల్లాలో వర్షాలు రాకపోయినా కృష్ణమ్మ కరుణించడంతో కడప జిల్లాలోని బద్వేలు, మైదుకూరు, నియోజవర్గాలకు తెలుగు గంగ ద్వారా, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలకు గండికోట ద్వారా, పొద్దుటూరు,కడప, మైదుకూరు నియోజకవర్గాలకు కడపకు కేసాయికట, కేసీ కెనాల్ ద్వారా ఆలస్యంగానైనా నీరు అందనుండడంతో జిల్లాలో చాలావరకు రైతాంగం గట్టేక్కే అవకాశం కనిపిస్తోంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.